



## విధుల నుంచి వలంటీర్ల తొలగింపు

**అనంతసాగరం/కావలిరూరల్ :** ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వలంటీర్లపై వేటు పడుతోంది. అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న అనంతసాగరం మండలం చిలకలమర్రికి చెందినహేమంత్, గోగులపల్లికి చెందిన చుక్క విజయ్ వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో తాజ్‌మస్రూర్ తెలిపారు. అలాగే వైసీపీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న కావలి మండలం ఆముదాలదిన్నె వలంటీర్ తాతా ప్రవీణ్‌ను కూడా విధుల నుంచి తొలగించారు. అంతేగాక 1వ పట్టణ సీఐ రాజేష్ సదరు వలంటీరుపై కేసు నమోదు చేశారు.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| రంజాన్ వేళలు | ఇఫ్తార్ (శనివారం) : 6.22 | సహరి (ఆదివారం) : 4.52 | ఉష్ణోగ్రతలు | నెల్లూరు : 34.6 26.2 | కావలి : 34.0 24.0 | కందుకూరు : 33.0 25.0 | ఆత్మకూరు : 36.0 24.0 |
| | | | | ఉదయగిరి : 34.0 22.0 | | | |

## పెంచులోరి సన్నిధిలో చంద్రన్న


స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు

ఘన స్వాగతం పలికిన టీడీపీ నేతలు

**రాపూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మవార్లను తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. సుమారు ఇరవై నిముషాలపాటు ఆలయంలో గడిపిన చంద్రబాబు సంప్రదాయం ప్రకారం అర్చకులు ఆయన గోత్రనామాలతో పూజలు చేశారు. శ్రీవారి కండువాను చంద్రబాబు మెడలో వేసి ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం ఎదుట ఉన్న హనుమంతుడిని కూడా దర్శనం చేసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాదు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో చంద్రబాబు రాపూరు మండలం గోనుపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. సర్వేపల్లి, వెంకటగిరి, సూళ్లూరుపేట అభ్యర్థులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, లక్ష్మీ సాయి ప్రియ, నెలవల విజయశ్రీలతోపాటు కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, హేమలత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, నాయకులు పరసారత్నం, నెలవల సుబ్రహ్మణ్యం, వేనాటి సతీష్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కేవీటీ ప్రసాద్‌నాయుడు తదితరులు చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన చంద్రబాబు పెంచలకోనకు చేరుకున్నారు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన చంద్రబాబు ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించు కున్నారు. చంద్రబాబును చూసేందుకు భక్తులు, టీడీపీ కార్యకర్తలు ఆసక్తి చూపారు. అనం తరం 4.30 గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌లో ఉండవల్లికి తిరుగు పయనమయ్యారు. చంద్రబాబు రాక నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు.

### నేడు నారా భువనేశ్వరి రాక

**వెంకటాచలం:** టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి శనివారం వెంకటాచలం మండలానికి రానున్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా పుంజులూరుపాడు, కురిచెర్లపాడు గ్రామాలలో ఉదయం ఆమె పర్యటించనున్నారు చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనోవేదనకు గురై మృతి చెందిన ఆర్ని నారాయణరెడ్డి, సుబ్బానాయుడు రెండు కుటుంబాలను ఆమె పరామర్శిస్తారన్నారు.



శ్రీవారి ఆలయంలో చంద్రబాబు











సూర్యప్రభ, హంస వాహనాల్లో శ్రీరంగనాథుడి చిద్విలాసం

## శ్రీరంగడికి సూర్య తేజం

**నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 :** తల్పగిరి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనంపై పేట ఉత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం హంస వాహనంలో స్వామివారికి నగరోత్సవం జరిగింది. ఉభయదాతలుగా రంగాచారి వెంకటేష్, హేమ దంపతులు, కంచర్ల సతీష్ చంద్రగుప్తా, మాలిని దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు సహాయ కమిషనర్ కే జనార్దన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ మంచి కంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఆలయ సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం సింహ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహన సేవ జరగనున్నాయి. కాగా, ఈనెల 27వతేదీ స్వామి వారికి రథోత్సవం జరగనుంది. ఇందుకుగాను శనివారం ఉదయం 11.30 గంటలకు రథంపై కలశ స్థాపన, పూజ కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ వర్గాలు తెలిపాయి.

### 18 ప్రాంతాల్లో చెక్‌పోస్టులు

**నెల్లూరు (హరనాథపురం) :** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు అక్రమ రవాణా జరగకుండా జిల్లాలోని 18 ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టర్ తన చాంబర్ నుంచి పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై మీనాకు వివరిస్తూ పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

## 'మోహిని'గా మురిసి.. గరుడుడిపై మెరిసి!

బ్రహ్మోత్సవాల్లో ప్రసన్నుడి వైభోగం

**బిట్రగుంట, మార్చి 22 :** బిలకూట క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ప్రసన్న వేంకటేశ్వర స్వామివారు మోహినీ అవతారంలో దర్శనమిచ్చారు. శిష్టరక్షణ దుష్టశిక్షణకై రాక్షస బారి నుంచి దేవతలను రక్షించేందుకు మహావిష్ణువు మోహినీ అవతారం ఎత్తారని ఆలయ ప్రధాన అర్చకుడు వీపూరి సత్యనారాయణ భక్తులకు వివరించారు. స్వామివారి మోహినీ అవతార ముఖాన్ని అద్దంలో చూసిన భక్తులు ఎంతగానో మురిసి పోయారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం స్వామి అమ్మవార్ల మూల విరాట్‌లకు పూలంగిసేవ భక్తులకు కనువిందు చేసింది.



మోహిని అవతారంలో దర్శనమిచ్చిన ప్రసన్నుడు

**● గరుడుడిపై కొలువుదీరి..**

రాత్రి గరుడుడిపై కొలువుదీరిన స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. విశాఖ నుంచి చెన్నై వరకు ఉన్న తూర్పు తీరప్రాంతాల్లోని 81 గ్రామాల శంభుని కుల సమాజం సహకారంతో ఈ మహోత్సవం వేడుకగా సాగింది. ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి, ఈవో రాధాకృష్ణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**● శ్రీవారిపాదాలకు ప్రత్యేక పూజలు**

విశ్వనాథరావుపేట, తాళ్ళూరు పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీవారి నిజపాదాల వద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. దాతల సహకారంతో మూడు రోజులపాటు అన్నసంతర్పణ కార్యక్రమాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. కాగా, కావలికి చెందిన జేఎంసీ కన్స్ట్రక్షన్స్ అధినేత జనిగర్లమహేంద్ర యాదవ్ బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు భక్తులకు అన్నదానం జరుగుతోంది. అలాగే శేషసాయి మందిరం, నాంచారమ్మ బ్రాహ్మణ ఆర్యవైశ్యుల సత్రాల్లో అన్నదానం జరుగుతోంది.

## 12 వేల టన్నుల క్వార్ట్జ్ సీజ్!

- పొదలకూరు, సైదాపురం మండలాల్లో దాడులు
- ఈ సరుకు విలువ రూ.50 కోట్లు!
- ఎట్టకేలకు కదిలిన అధికార యంత్రాంగం
- బాధ్యులను గుర్తించాలంటూ పోలీసులకు ఫిర్యాదు

**నెల్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) :** ఎన్నికల కోడ్ రావడం, ప్రతిపక్షాలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయడం ప్రారంభించడంతో ఎట్టకేలకు జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. గడిచిన మూడు రోజుల వ్యవధిలోనే సుమారు 12 వేల టన్నుల క్వార్ట్జ్‌ను అధికారులు సీజ్ చేశారు. ప్రభుత్వ, పట్టా భూముల్లో అనధికారికంగా తవ్వకాలు జరిపి విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన క్వార్ట్జ్‌నూ గుర్తించారు. పొదలకూరు మండలం మొగళ్లూరులో ఒకచోట 3 వేల టన్నులు, మరో చోట వెయ్యి టన్నుల అక్రమ క్వార్ట్జ్‌ను సీజ్ చేశారు. మరుపూరులో 2,990 టన్నుల క్వార్ట్జ్‌ను పట్టుకున్నారు. పొదలకూరు మండలంలోని గురవాయపాలెంలో ఓ చోట 1200 టన్నులు, మరో చోట 450 టన్నుల మైకా క్వార్ట్జ్‌ను సీజ్ చేశారు. ఇక సైదాపురం మండలం జోగుపల్లి వద్ద కూడా మరో 3 వేల టన్నుల క్వార్ట్జ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకు విలువ సుమారు రూ.50 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ సరుకును స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించారు. అలానే పొదలకూరు, సైదాపురం పోలీసు స్టేషన్లలో కూడా కేసులు పెట్టారు. ఆ క్వార్ట్జ్‌ను అక్రమంగా తవ్విన వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలని ఫిర్యాదుల్లో మైనింగ్ అధికారులు పేర్కొన్నట్లు తెలిసింది.

**● తెర వెనుక ఎవరు?**

ఇంత భారీ మొత్తంలో అక్రమంగా తవ్విన క్వార్ట్జ్‌ను అధికారులు సీజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ సరుకంతా ఎవరిది? ఎవరి ప్రమేయంతో ఇంత బరితెగించి అక్రమ తవ్వకాలు జరిపారు? తెరవెనుక ఉన్న డాన్‌లు ఎవరు? అన్నది ఆసక్తిగా మారింది. వైసీపీ కీలక నేతల కనుసన్నల్లో ఈ అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలు జరిగినట్లు స్థానికులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. మరి ఆ నేతలపై కేసులు నమోదు చేస్తారా లేక తూతూమంత్రంగా ఎవరో ఒకరిపై చిన్నపాటి కేసులు పెట్టి వదిలేస్తారా!? లేక అసలు కేసే లేకుండా చేస్తారా!? అన్నది చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు అక్రమ క్వార్ట్జ్ తవ్వకాలను ప్రతిపక్షాలు ఆధారాలతో సహా నిరూపిస్తుండగా, మరోవైపు అధికారులు దాడులు చేస్తూ ఆ క్వార్ట్జ్‌ను సీజ్ చేస్తున్నారు. అయినా వైసీపీ నేతలు అక్రమ తవ్వకాలు జరగలేదంటూ ఎదురుదాడులు చేస్తుండటం ప్రజలను విస్తుగొలుపుతోంది. ఇప్పుడు అధికారులు దాడులు చేసి సరుకు సీజ్ చేస్తున్నారు సరే.. మరి ఇప్పటివరకు జరిగిన అక్రమాల మాటేమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.



పొదలకూరు మండలం మొగళ్లూరులో అధికారులు సీజ్ చేసిన క్వార్ట్జ్

## పార్లమెంట్‌కు వీపీఆర్.. సర్వేపల్లికి సోమిరెడ్డి!

● మూడో జాబితా విడుదల చేసిన టీడీపీ

**నెల్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) :** నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిల పేర్లను ఆ పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. ఈ రెండు స్థానాల అభ్యర్థుల ప్రకటనతో జిల్లాలోని అన్ని స్థానాలకు టీడీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్) జిల్లా ప్రజలకు సుపరిచితులు. ప్రముఖ పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందిన వీపీఆర్ ధార్మిక, సేవా కార్యక్రమాల ద్వారా జిల్లావాసులకు దగ్గరయ్యారు. వీపీఆర్ ట్రస్టు ద్వారా వందలాది గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి దాహార్తి తీరుస్తున్నారు. నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నారు. ఈయన సమాజానికి చేస్తున్న సేవల ఫలితంగా ఈయనకు రాజ్యసభ సభ్యత్వం లభించింది. రాజ్యసభ సభ్యుడిగా ఆరేళ్లపాటు సేవలందించారు. ఈ ఎన్నికలలో నెల్లూరు పార్లమెంట్‌కు టీడీపీ అభ్యర్థిగా ప్రత్యక్ష బరిలో నిలుస్తున్నారు.





● ఇక సర్వేపల్లి టీడీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఖరారయ్యారు. టీడీపీ సీనియర్ నాయకుడు, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అయిన సోమిరెడ్డి పేరు తొలి జాబితాలోనే ప్రకటించాల్సి ఉంది. కొన్ని ప్రత్యేక కారణాల నేపథ్యంలో అధిష్ఠానం పెండింగ్‌లో ఉంచింది. ఈ క్రమంలో అభ్యర్థి విషయమై రకరకాల పుకార్లు వచ్చాయి. అయితే సోమిరెడ్డి పార్టీకి చేసిన సేవలను, సీనియారిటీని దృష్టిలో ఉంచుకొని పార్టీ పెద్దలు ఆయన్నే సర్వేపల్లి అభ్యర్థిగా ప్రకటించింది. కాగా, జిల్లాలోని నెల్లూరు నగరం, రూరల్, ఆత్మకూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు, కోవూరు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లను ఒకటి, రెండు జాబితాల్లో ప్రటించిన విషయం తెలిసిందే.

### పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకి చర్యలు

**నెల్లూరు, (జడ్పీ), మార్చి 22:** సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సరఫరాకి చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. జిల్లాలోని డీఈఈ, ఏఈఈలతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. గూడూరు సబ్ డివిజన్‌లో 434, కోవూరు డివిజన్‌లో 386, నాయుడు పేట డివిజన్ 463, నెల్లూరు రూరల్ 509, నెల్లూరు నగరంలో 298 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఎన్నికల జిల్లా అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ప్రతి కేంద్రంలో విద్యుత్ సరఫరా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని అయన అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

## కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్!

**కందుకూరు, మార్చి 22 :** స్థానిక తిక్కవరపు రామిరెడ్డి (టీఆర్‌ఆర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్ దక్కిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 14, 15వ తేదీలలో న్యాక్ బృందం కళాశాలను సందర్శించినట్లు తెలిపారు. కళాశాలలో బోధనా పద్ధతులు, పరిశోధనా సామర్థ్యం, మౌలిక వసతులు, విద్యార్థుల క్రీడా, సాంస్కృతిక సామర్థ్యాలు, కళాశాల నిర్వహణ, హరితవనాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఏ ప్లస్ గ్రేడ్‌ను కేటాయించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రాజగోపాలబాబు, అధ్యాపకులు, సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.





## కలిసి కట్టుగా విజయం సాధిద్దాం

● జనసైనికులకు పిలుపునిచ్చిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 22:** జిల్లాలో, రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. నెల్లూరులోని జనసేన జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటంతోనే గెలుపు ఖాయ మైందన్నారు. నారా చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిగా చేసు కోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ మాట్లాడుతూ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి జనసైనికులందరూ సహకరించాలని కోరారు. టీడీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కొన్ని సమీకరణల వల్ల కూటమి పార్టీలకు జిల్లాలో సీటు కేటాయించలేక పోయామన్నారు. రాష్ట్రాన్ని జగన్మోహన్‌రెడ్డి కబంధ హస్తాల నుంచి రక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, కోవూరు అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఉదయగిరి అభ్యర్థి కాకర్ల సురేష్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఆనం రంగమయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ కార్యాలయంలో వీపీఆర్, ప్రశాంతి, ఆనం, కాకర్ల, అజీజ్, మనుక్రాంత్ తదితరులు

# పౌరుల చేతిలో 'సి విజిల్'

- ఉల్లంఘనుల భరతం పట్టేందుకు ప్రత్యేక యాప్
- ఫిర్యాదు చేసిన గంటల వ్యవధిలో ఈసీ చర్యలు

**పొదలకూరు/ ఆత్మకూరు, మార్చి 22 :** సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ల వ్యవస్థ అధికార పార్టీ కనుసన్నల్లో పనిచేసేందుకు సిద్ధమవుతోంది. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందులో పౌరులను సైతం భాగస్వాములను చేస్తోంది. 'సీ విజిల్' యాప్ ద్వారా ఈ అవకాశం కల్పించింది. దాని గురించి తెలుసుకుని, నిబంధనలు ఉల్లంఘించే వారి పని పట్టండి. ముందుగా గూగుల్ ప్లేస్టోర్ నుంచి 'సీ విజిల్' యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మీ సెల్ నెంబరును రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేస్తే 'సీ విజిల్' యాప్ సిద్ధమైనట్లే. దాని ద్వారా మీరు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు చేయవచ్చు.




**● ఫిర్యాదు ఎలా ?**

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైనైనా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, పోలింగ్ రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం. ఇలాంటి ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రికార్డ్ చేసి అప్‌లోడ్ చేయాలి. సి విజిల్ యాప్ తెరవగానే తెరపై 'ఫొటో', 'వీడియో', 'ఆడియో' అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. మీరు ఫొటో ద్వారా ఫిర్యాదు చేయాలనుకుంటే ఫొటో ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. మీ లొకేషన్ నమోదవుతుంది. ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను అప్‌లోడ్ చేయండి. ఏ రాష్ట్రం, ఏ నియోజకవర్గం తదితర వివరాలను నమోదు చేయాలి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. ఇది ఎన్నికల సంఘానికి చేరుతుంది.

**● స్పందన ఇలా..**

యాప్‌లో వివరాలు పొందుపరచగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దానిని ఫీల్డ్ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. ఆయన దానిపై 50 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారు. ఇలా 100 నిమిషాల్లో సీ విజిల్ యాప్‌లో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది.


**● కోడ్ పరిధిలోకి ఉద్యోగులు**

రాజకీయ నాయకులకు ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారం చేయరాదనే నిబంధనలు 1949 సెప్టెంబరు 17నుంచి అమల్లోకి వచ్చాయి. సెక్షన్ 23(ఐ) ప్రకారం వారంతా ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఇది వర్తిస్తోంది. ఎన్నికల కోడ్ గీత దాటితే శాఖాపరమైన చర్యలు తప్పక ఉంటాయి.

# రశీదే రక్షణ!

**రూ.50 వేలకు మించితే పత్రాలు తప్పనిసరి**

**ఉదయగిరి రూరల్, మార్చి 22 :** సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నగదు రవాణాపై నిఘా పెరిగింది. ఓటర్లకు డబ్బు, మద్యం, ఇతర వస్తువులు పంపిణీ చేసి ప్రలోభాలకు గురిచేస్తా రన్న ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ తరుణంలో ఎన్నికల నియమావళిపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరైన ఆధారాలు లేకుండా నగదు తీసుకెళితే ఎన్నికల అధికారులు సీజ్ చేసి కోర్టుకు అప్పగిస్తారు.



- రాజకీయ పార్టీల నాయకులు రూ.50 వేలకుమించి నగదు, రూ.10 వేల విలువకు మించిన వస్తువులు రవాణా చేయకూడదు.
- ఇక ప్రజలు రూ.50 వేలకుమించి నగదు తీసుకెళ్తున్నట్లయితే బ్యాంకు నుంచి నగదు డ్రా చేసిన రశీదు తప్పనిసరిగా ఉండాలి.
- నగదు ఎవరికి చెల్లించేందుకు తీసుకెళుతున్నారో ఇన్‌వాయిస్ పత్రం ఉండాలి.
- ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు సంబంధించి వేతనాల చెల్లింపునకు నగదు తీసుకెళ్తుంటే వారి జాబితా, డ్రా చేసిన రశీదు వివరాలు ఉండాలి.
- వైద్యశాలలకు చెల్లించేందుకు నగదు తీసుకెళ్తుంటే సంబంధిత నివేదికలు, రోగి వివరాలు ఉండాలి.
- రైతులు ఏమైనా కొనుగోలుకు తీసుకెళుతున్నట్లయితే వ్యాపార సంస్థల నుంచి ఇన్‌వాయిస్ లేదా కొటేషన్స్ తీసుకుంటే మంచిది.
- భూములు, స్థలాలకు సంబంధించిన లావాదేవీలైతే దస్తావేజులు, మీసేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్న స్లాట్ వివరాలు ఉండాలి.

## అదాని కృష్ణపట్నం పోర్టుకు గ్రీన్ లీఫ్ ప్లాటినం అవార్డు

**ముత్తుకూరు, మార్చి 22:** అదాని కృష్ణపట్నం పోర్టులో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, ఆరోగ్యం, భద్రత వంటి అంశాల్లో చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించి ప్రతిష్ఠాత్మకమైన 2023 అపెక్స్ ఇండియా గ్రీన్ లీఫ్ ప్లాటినం అవార్డును శుక్రవారం అపెక్స్ గ్రీన్ ఇండియా ఫౌండేషన్ న్యూఢిల్లీలో ప్రకటించారు. అవార్డు రావడం పట్ల శుక్రవారం పోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజేరావు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికుల నైపుణ్యాభివృద్ధికి అదాని కృష్ణపట్నం పోర్టు కృషి చేస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు బాధ్యతాయుతమైన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు.

# బరితెగిస్తున్న మైనింగ్ మాఫియా

- కోడ్ అమల్లో ఉన్న జే ట్యాక్స్ వసూలు
- లారీలను ఆపి తనిఖీ చేస్తున్న యువకులను అడ్డుకున్న యండీయల్ డీలర్లు



లారీలను ఆపి తనిఖీ చేస్తున్న యువకులు

**సైదాపురం, మార్చి 22:** ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కైవల్యానది సమీపంలో జే ట్యాక్స్ కట్టకపోతే లారీలను కొందరు మానింగ్ మాఫియా ప్రయివేట్ యువకులతో లారీలను నిలిపి తనిఖీలు చేస్తున్నట్లు ఎండీఎల్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు ఉన్న లారీలను ఎందుకు నిలుపుతున్నారని ప్రశ్నించారు. టన్నుకు రూ.6వేలు వసూలు చేస్తున్నారని వాపోయారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న అధికారులు పట్టించుకోవడం లేదని ఈ విషయాన్ని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం

**కావలి రూరల్, మార్చి 22:** కావలి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని సుమారు 35 నుంచి 40 ఏళ్ల గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం తెల్లవారు జామున గుర్తించారు. జీఆర్పీ పోలీసుల కథనం మేరకు.. రైల్వే స్టేషన్‌లోని రెండవ నెంబరు ప్లాట్ ఫాం చివరలో చెన్నై మార్గంలో రైలు పట్టాలపై మృతదేహాన్ని చార్మినార్ ఎక్స్‌ప్రెస్ లోకో పైలెట్ గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జీఆర్పీ పోలీసులు పట్టాలపై పడి ఉన్న మృతదేహాన్ని పరిశీలించి పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉంది. మృతురాలు రోజ్ కలర్ చుడీదార్, వైట్‌ప్యాంట్, వైట్ చున్నీ ధరించి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ అరుణ కుమారి తెలిపారు.

**చికెన్ ధరలు**

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 118 |
| లేయర్ లైవ్ | 73 |
| స్కిన్ చికెన్ | 214 |
| స్కిన్‌లెస్ | 236 |
| లేయర్ | 125 |

**బంగారం, వెండి ధరలు**

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ. 6318 |
| వెండి కిలో ధర | రూ. 76,300 |
| వెండి ఒక గ్రాము | రూ. 78.30 |


## ఈసీలకు ఇక్కట్లు

# రిజిస్ట్రేషన్లకు బ్రేక్ !

- పది రోజులుగా దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు ఆటంకం
- 1.0 నుంచి 2.0కు సాఫ్ట్‌వేర్ మార్పుతో ఇబ్బందులు
- రూ.5కోట్లకు పైబడి ఆదాయానికి గండి

**నెల్లూరు(హరనాథపురం), మార్చి 22 :** జిల్లాలో దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు, ఈసీ (ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్)ల జారీకి తీవ్ర విఘాతం కలుగుతోంది. పది రోజుల నుంచి ఈ పరిస్థితి కొనసాగుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రభుత్వం దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు పాత పద్ధతి అయిన 1.0కు బదులుగా 2.0 సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చిన విషయం విదితమే. దీంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యలు ప్రారంభమయ్యాయనే ఆరోపణలున్నాయి. ఇక, ఆస్తి వివరాలు సంపూర్ణంగా తెలుసుకోడానికి ఈసీలు ఎంతో ముఖ్యం. ఆ సర్టిఫికెట్ ద్వారా స్థలం, భూమి వివరాలు తెలుసుకుని సమస్యలు లేకుంటే కొనుగోలు చేస్తారు. అలాంటి ఈసీల జారీకి కూడా 2.0 విధానంలో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. నూతన పద్ధతిలో ఈసీలకు ప్రత్యేక ఫార్మేట్ రూపొందించారు. అయితే అందులో పూర్తి వివరాలు రావడం లేదు. 1.0 విధానంలో రిజిస్టర్డ్ డాక్యుమెంటు నంబరు నమోదు చేయగానే ఈసీలు వెంటనే వచ్చేవి. కానీ సాఫ్ట్ వేర్‌ను 2.0కు మార్పు చేయటంతో డాక్యుమెంటు నంబరు ఇచ్చినా ఈసీలు రావటం లేదు. న్యాయవాదులు కూడా ఆస్తికి సంబంధించి లీగల్ ఒపీనియన్ కోసం ఈసీలు అడుగుతుంటారు. వాటిలోనూ పూర్తి వివరాలు రాకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పది రోజులుగా ఈసీలు రాకపోవటంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్లు చేయించుకోవటం కష్టతరంగా ఉంది. ఒక వేళ అరకొరగా ఈసీలు వచ్చినా అందులో పూర్తి వివరాలు ఉండటం లేదు.




**ఆదాయానికి గండి**

జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా జరుగుతోంది. భూములు, స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగుతున్నాయి. అయితే 2.0 సాఫ్ట్‌వేర్ మార్పుతో 10 రోజుల నుంచి రిజిస్ట్రేషన్లు జరగకపోవటంతో స్టాంపులు-రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి రూ.5కోట్లకు పైబడి గండి పడి నట్లు అంచనా. స్థానిక అధికారులు సమస్యను ఉన్నతాధి కారులకు తెలియచేసినా ఫలితం కనిపించటం లేదు. ప్రజలు మాత్రం రిజిస్ట్రేషన్, ఈసీల కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

ఈసీల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. 2.0 పద్ధతి ఈసీలకు కూడా ప్రవేశ పెట్టారు. త్వరలో ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

\- బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్

## పదో తరగతి పరీక్షలకు 28,638 మంది హాజరు

**నెల్లూరు (విద్య), మార్చి 22 :** జిల్లాలోని 176 కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శుక్రవారం గణితం పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 30,296 మంది విద్యార్థులకుగాను 28,638 మంది హాజరుకాగా 1,658 మంది గైర్హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28,301 మందికి 27,513 మంది, ప్రైవేట్ విద్యార్థులు 1,995 మందికి 1,125 మంది హాజరయ్యారు. ఏడు కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ తీరును విద్యాశాఖ జేడీ, జిల్లా అబ్జర్వర్ మువ్వా రామలింగం పరిశీలించారు. డీఈవో పీజేవీ రామారావు ఐదు కేంద్రాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ 55 సెంటర్లను పరిశీలించాయి.

## కావలిలో విద్యార్థినికి అస్వస్థత

- చికిత్స కోసం ఆసుపత్రికి తరలింపు

**కావలి రూరల్, మార్చి 22:** కావలి పట్టణంలో 10వ తరగతి పరీక్ష రాస్తూ ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైంది. వివరాల మేరకు... మండలంలోని సర్వాయపాలెంకు చెందిన సీహెచ్ ధరణి పట్టణంలోని భాష్యం స్కూల్‌లో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్ష కేంద్రానికి శుక్రవారం పరీక్ష రాసేందుకు హాజరైంది. పరీక్ష రాస్తుండగా వాంతులు చేసుకుని అస్వస్థతకు గురైంది. విషయం తెలుసుకున్న ఎగ్జామినేషన్ చీఫ్ మాధవరావు ఆ విద్యార్థినిని చికిత్స నిమిత్తం పరీక్ష కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం సుమతి ద్వారా ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అనంతరం విద్యార్థిని ఆరోగ్యం కుదుటపడడంతో కుటుంబ సభ్యులతో ఇంటికి చేరుకుంది.

## సోమశిలలో 11.251 టీఎంసీల నీరు నిల్వ

**అనంతసాగరం, మార్చి 22:** సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శుక్రవారానికి ప్రాజెక్టులో 11.251 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

## నిజాయితీగా ఓటుహక్కు వినియోగించుకోండి

- సెల్ఫీ పాయింట్ ప్రారంభంలో కలెక్టర్




ఓటుహక్కు సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 :** ఓటు హక్కు కలిగిన యువత నిజాయితీగా ఓటు వేయాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని ఎంజీ మాల్‌లో ఓటు హక్కు సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు. ఓటుహక్కు అవగాహనలో భాగం గా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సెల్ఫీ పాయింట్ మే 11వతేదీ వరకు ఉంటుందని తెలిపారు. నగర ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటును ఆయుధంగా వినియోగించుకోవాలని కోరారు. 18 నుంచి 21 ఏళ్ల వయసు కలిగిన యువ ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్భయంగా ఓటు వేయాలని, ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్వో లవన్న పాల్గొన్నారు.

## ఎక్స్ సర్వీస్ పర్సనల్‌కు కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకాలు

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** ఎక్స్‌సర్వీస్ పర్సనల్‌గా ఉండి 45 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగిన వారికి మూడేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి పీఎస్ రమేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి 45 కంటే తక్కువ వయసు కలిగిన ఎక్స్ సర్వీస్ పర్సనల్ ఆర్‌పీఎఫ్ విజయవాడ డివి జన్ పరిధిలో పనిచేయడానికి వివరాలను నెలాఖరులోపు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు తమ కార్యాలయంలోగానీ, 0861-232 8419 నెంబరునుగానీ పని వేళల్లో సంప్రదించాలని కోరారు.

## 25 మద్యం సీసాల స్వాధీనం

**బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 22:** మండలంలోని రేబాల మిక్సిడ్ కాలనీలో శుక్రవారం ఓ బెల్టు దుకాణం నిర్వహి స్తున్న డబ్బుగుంట వెంకటేశ్వర్లు వద్ద 25 మద్యం సీసాలను ఎస్ఈబీ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. కాగా, మద్యం విక్రేత కుమారుడు రేబాల పరిధి (కాగులపాడు సెంటర్)లోని ప్రభుత్వ మద్యం దుకాణంలో క్యాషియర్ అని తెలిసింది. దీనిపై సెబ్ సీఐ యశోధరాదేవిని వివరణ కోరగా... మద్యం విక్రేత డి వెంకటేశ్వర్లు కుమారుడు రేబాల పరిధిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో క్యాషియర్ అని తెలిసిందని, విచారించి విధుల నుంచి తొలగిస్తామని తెలిపారు.

## ఇతోధికంగా రుణాలిచ్చాం

- ఆర్బీఐ ఏజీఎం హనుమకుమారి



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హనుమకుమారి

**నెల్లూరు(హరనాథపురం), మార్చి 22 :** బ్యాంకుల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం రుణాలను ఇతోధికంగా అందచేశామని ఆర్బీఐ ఏజీఎం హనుమకుమారి తెలిపారు. నెల్లూరులోని బ్యాంక్ ఆఫ్ ఇండియా సమావేశ మందిరంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత 9 నెలల్లో జిల్లా మొత్తం మీద రూ.20,560 కోట్ల రుణ పంపిణీ లక్ష్యంకాగా రూ.20,469 కోట్లు పంపిణీ చేశామని చెప్పారు. రైతులకు రూ.11,150 కోట్ల వ్యవసాయ రుణాలు ఇచ్చామని, వ్యాపారవేత్తలకు ఎంఎస్ఎంఈ రుణాలు అందచేశామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్, నాబార్డు డీడీఎం రవి సింగ్, బ్యాంకు కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## 76 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

**కావలి రూరల్, మార్చి 22:** కావలి పట్టణం ముసునూరు టోల్ గేట్ వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న 76 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావు కథనం మేరకు... సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టోల్‌గేట్ వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం వాహ నాలు తనిఖీ చేస్తుండగా కావలి వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న నెంబరు ప్లేటు లేని బొలేరో ట్రక్ వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో రేషన్ బియ్యం బస్తాలు తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ట్రక్‌ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అందులో ఉన్న 3 టన్నుల 800 కేజీల బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. ఒలేటివారిపాలెం మండలానికి చెందిన ట్రక్ డ్రైవర్ శివకుమార్‌ను విచారించగా ప్రకాశం జిల్లాలో సేకరించిన బియ్యం నెల్లూరుకు తరలిస్తున్నట్లు చెప్పినట్లు తెలిసింది. బొలేరో ట్రక్ కావలి పట్టణం బాలక్రిష్ణారెడ్డినగర్‌కు చెందిన కందలపు సురేష్‌దిగా గుర్తించి డ్రైవర్‌తో పాటు వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



పోలీస్ స్టేషన్‌లో రేషన్ బియ్యంతో పట్టుబడ్డ వాహనం

# తప్పని నీటి కష్టాలు


**సీతారామపురం, మార్చి 22:** మండలంలోని 14పంచాయతీలలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. పబ్బులేటిపల్లి, బొడసిద్దయిపల్లి, గడ్డమీదపల్లి, గుండుపల్లి, సింగరెడ్డిపల్లి, సంగసానిపల్లి, సీతారామపురం గ్రామాల్లోని బోర్లలో నీరు తగ్గిపోవడంతో వేసిన పంటలు చేతికి అందే పరిస్థితి కనిపించడం లేదని రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. స్వామి చెరువు, ఊర చెరువు, మర్రివట్ల రిజర్వాయర్లలో రెండేళ్లుగా చుక్కనీరు లేకపోవడంతో తుమ్మచెట్లు మలచి అడవిని తలపిస్తోంది. చెరువుల కింద 6వేల ఎకరాలు బీడుగా ఉన్నాయి.

**● తప్పని తాగునీటి కష్టాలు..**

మండలంలోని మెజార్టీ గ్రామాల్లోని బోర్లలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ సమస్యతో పంచాయతీ కొళాయిలకు నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్థులు డబ్బులు చెల్లించి నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. బబూల్ నీటిని తాగితే ఒళ్లు నొప్పులతో హాస్పిటల్ పాలవుతున్నామని వాపోతున్నారు. తీవ్ర కరు వుతో పశువులకు మేతలేక పక్క జిల్లాల నుంచి పశుగ్రాసం కొనుగోలు చేసుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కరువు మండలానికి నష్ట పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నీళ్లు లేక ఎండిపోతున్న సజ్జ పంట



చెరువులో నీళ్లు లేక బీడువారిన భూమి

# ఉద్యోగం చిన్నది.. బాధ్యత పెద్దది!

- 8నెలలుగా అందని కూరగాయల, గ్యాస్ బిల్లులు
- నిత్యం అప్పు చేయాల్సిన దుస్థితి
- పాత జీతాలు అందని వైనం
- సమ్మె చేస్తే ఫిబ్రవరి జీతంతో సరి..
- సమస్యలతో చిన్నారుల పౌష్టికాహారంపై ప్రభావం
- ఇవీ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల తిప్పలు

**ఉదయగిరి రూరల్, మార్చి 22:** అరకొరగా వేతనం, నెల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కార్యకర్తలు, ఆయాలకు భారంగా మారుతోంది. కేంద్రాలకు కూరగాయల బిల్లులు నెలల తరబడి రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే అరకొర వేతనాలతో ఇంటి, నెలవారీ ఖర్చులకే అవస్థలు పడుతున్న తమపై కూరగాయల బిల్లుల భారం మరింత ఆర్థిక ఇబ్బందులు పెడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం నడవాలంటే నిత్యం కూరగాయలకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు తమ సమస్యల పరిష్కారానికి 42 రోజులు అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారు. ప్రభుత్వం అప్పటి వేతనాలు వేయకపోగా, ఫిబ్రవరి మాసానికి సంబంధించిన వేతనం మాత్రమే వారి ఖాతాల్లో జమ చేసింది.

**జిల్లాల అంగన్‌వాడీల పరిస్థితి..**

జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,934 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 1.38లక్షల మంది ఉన్నారు. గర్భవతులు, బాలిం తలకు ఇంటి వద్దకే పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. చిన్నారులకు మాత్రం కూరగాయలు కొనుగోలు చేసి కేంద్రాల్లోనే పదార్థాలను వండాల్సి ఉంది. సమ్మెకాలం తీసేస్తే ఎనిమిది నెలల కూరగాయలు, గ్యాస్ బిల్లులు అందజేయాల్సి ఉందని కార్యకర్తలు వాపోతున్నారు. కేంద్రాల్లో ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అధికారులు వత్తిడి తెస్తున్నారే తప్ప బిల్లుల మంజూరు చొరవపై చూపడంలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ ప్రభావం పౌష్టికాహారంపై పడుతోందని చెబుతున్నారు.

**అప్పులు చేయాల్సి వస్తుంది..**

ఏడెనిమిది నెలలకోసారి కూరగాయలు, గ్యాస్ బిల్లులు చెల్లిస్తుండడంతో అప్పులు చేయాల్సి వస్తుందని కార్యకర్తలు వాపోతున్నారు. వేతనాల్లో అయినా సర్దుబాటు చేసుకొందామంటే అవి కూడా సక్రమంగా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తే ప్రభుత్వం సూచించిన మెనూ అమలు చేసే అవకాశం ఉంటుంది. ఉదయ గిరి పట్టణంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో 25మంది చిన్నారులు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూరగాయలు, పప్పు దినుసులు, గ్యాస్ కోసం రూ.2ఖర్చులు చేయాల్సి ఉంది. ఈ లెక్కన రోజుకు రూ.50లు, నెలకు రూ.1500లు ఖర్చవుతుంది. ఇలా ఒక్కో కేంద్రానికి చిన్నారుల సంఖ్యను బట్టి కూరగాయల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నెలనెలా బిల్లులు, వేతనాలు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని కార్యకర్తలు, ఆయాలు కోరుతున్నారు.



ఉదయగిరి అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

**త్వరలో జమవుతాయి**

అంగన్‌వాడీ కేంద్రాల కూరగాయల బిల్లులకు సంబంధించి గతేడాది డిసెంబరు మాసం వరకు బిల్లులు పెట్టాం. త్వరలో కార్యకర్తల ఖాతాల్లో బిల్లులకు సంబంధించిన నగదు జమవుతోంది. మిగిలిన మాసాలకు సంబంధించిన బిల్లులు సైతం త్వరలో చెల్లిస్తాం.

\- పచ్చవ లావణ్య, సీడీపీవో, ఉదయగిరి

# ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

● జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి

కలువాయి, మార్చి 22: వారంరోజుల్లో ప్రతి రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. శుక్రవారం వెరుబొట్లపల్లిలో నూర్పిడి చేసిన వరి ధాన్యంను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కేంద్రాలకు రైతులు ధాన్యంను తీసుకొచ్చి మద్దతు ధరకు అమ్ముకోవాలని సూచించారు. తెలంగాణా మసూరి రకం ధాన్యంను చైన్నైలోని రెడ్‌హిల్స్ మార్కెట్‌లో పుట్టి రూ.21 వేల అమ్ముకుంటున్నామని రైతులు ఆమెకు తెలిపారు. జొన్నలు కూడా మార్కెఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి ప్రతాప్ ఉన్నారు.

**ఆత్మకూరు:** ప్రతి రైతుభరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని మండల వ్యవసాయశాఖాధికారి కిషోర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పండించిన పంటను దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు అమ్ముకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పుట్టికి(850 కేజీలు) రూ.18,725 లెక్కన, కెఎన్ఎం-1638, ఆర్ఎన్ఆర్-15048 మొదలైన గ్రేడు-ఏ రకాలను కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం తరలింపునకు గోనె సంచులను ఉచితంగా సరఫరా చేయడంతో పాటు లేబర్ చార్జీలు, ధాన్యం రవాణా ఖర్చులు సైతం ప్రభుత్వం భరిస్తుందని వివరించారు.

**చేజర్ల :** రైతులు పండించిన జొన్న పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి తెలిపారు. శుక్రవారం చిత్తలూరులో రైతులు పండించిన జొన్నలను పరిశీలించారు. బయట మార్కెట్‌లో దళారులను బతిమలాడితే క్వింటం కేవలం రూ.2 నుంచి రూ.3వేలు వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వ్యవసాయశాఖ అధికారి ముందు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తేమశాతం, నాణ్యతా ప్రమాణాలకు తగినట్లుగా ఉంటే మార్కెఫెడ్‌తో క్వింటం రూ.3180కు కొనుగోలు చేస్తారని తెలిపారు. జొన్నలు పండించిన రైతులు అర్‌బీకేలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వరి ధాన్యానికి కూడా మద్దతు ధర బాగుందని రైతులెవ్వరూ దళారులను నమ్మి మోసపోకుండా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏడీఏ నర్సోజీరావు, ఎఈవో వెంకటేశ్వర్లు, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.



చిత్తలూరులో జొన్నలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి



ఆత్మకూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంఏవో కిశోర్‌బాబు

## ఎన్నికల నియమావళి పాటించండి

సీతారామపురం, మార్చి 21: పంచాయతీలోని బస్టాండ్ సెంటర్, మెయిన్‌బజార్, పరమటివీధి, కోటవీధి, రాజుగారి వీధి, నారాయణంపేట, పాండ్రంగి, కొటాల్, సంగసానిపల్లి ప్రాంతాల్లో శుక్రవారం మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ నోడల్ అధికారి అబ్దుల్ కలాం ఆజాద్, ఈవోపీఆర్డీ భార్గవి పర్యటించారు. రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లు ఉండరాదని కార్యదర్శి జీవన్‌కుమార్‌కు సూచించారు. అనంతరం సీతారామపుర పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాట్లను పరిశీలించారు. దివ్యాంగులకు ర్యాంపుల ఏర్పాటుపై చర్చించారు.

## నైపుణ్యాలను వెలికితీయాలి



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి రూరల్, మార్చి 22: విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలు, నైపుణ్యాలను వెలికితీసేలా బోధన చేయాలని ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌బీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని, రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పాఠశాలల్లో రాజకీయ నాయకుల ఫోటోలు లేకుండా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఏప్రిల్‌లో జరిగే ఎస్ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రంగులు మాయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరికుంటపాడు, మార్చి 22: మండలంలో ఎన్నికల కోడ్ అమలు తీరుపై శుక్రవారం ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన నామ మాత్రపు పర్యవేక్షణ కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. మండల కార్యాలయంలోని పార్టీ రంగులు కనిపించ కుండా బెంచీలకు తెల్ల సున్నం వేయిం చారు. అలాగే గ్రామాల్లో సమగ్రంగా పరి శీలించి కోడ్ అమలుకు చర్యలు తీసుకుం టామని చెప్పారు.



గుర్తులు కనిపించకుండా వేసిన సున్నం

## ట్రైనీ కలెక్టర్ గండిపాలెం జలాశయం పరిశీలన

ఉదయగిరి రూరల్, మార్చి 22: పొన్నెబోయిన చెంచురామయ్య గండిపాలెం జలాశయాన్ని శుక్రవారం ట్రైనీ కలెక్టర్ సంజనాసిన్హా జలవనరుల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జలాశయ నిర్మాణాన్ని ఎప్పుడు ప్రారంభించారు. ఎప్పటికీ పూర్తయ్యిందని, జలాశయానికి నీరు ఎక్కడ వస్తుందని, జలాశయం కింద ఆయకట్టు సాగు ఎంత ఉందని అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం జలాశయ గేట్ల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జలాశయం పరిధిలో విధులు నిర్వహించే లస్కర్లు వారిని కలిశారు. కొన్నినెలలుగా తమకు వేతనాలు ఇవ్వలేదని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ దృష్టికి వెళ్లి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉదయగిరి ఆనకట్ట, పెద్దచెరువులను పరిశీలించారు. ఆయన వెంట జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ చంద్రమౌళి, ఏఈలు సురేష్, వేణు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సంజనా సిన్హా

## క్షయవ్యాధిపై అప్రమత్తత అవసరం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మార్చి 22: ఒకటి, రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం ఉంటే క్షయవ్యాధిగా అనుమానించి పరీక్షలు చేయించుకొని అప్రమత్తంగా ఉండాలని వైద్యులు మనోజ్ఞ, అయూబ్‌అప్సర్, హరీష్‌లు సూచించారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్రవాడ, దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన సదస్సు లు, గ్రామాల్లో నినాదాలతో కూడిన ర్యాలీ చేపట్టారు. క్షయవ్యాధి నిర్ధారణ జరిగితే చికిత్స పూర్తయ్యే వరకు ఉచితంగా మందులతో పాటు ఆ వ్యక్తికి నెలకు రూ.500లు పోషకాహార నిమిత్తం నగదు అందజేస్తామన్నారు. 2025 నాటికి క్షయవ్యాధిని పూర్తిగా అంతం చేయడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. సీహెచ్‌వో ఓంకారయ్య, ఎంపీహెచ్‌వోలు రియాజ్, ఖాజామొహిద్దీన్, షఫీ, శివ, షబ్బీర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● **ఉదయగిరి :** స్థానిక బాలాజీనగర్, నాగులబావివీధి, ఆంజనేయస్వామి గుడి, బ్రాహ్మణవీధి, మెయిన్‌బజార్ మీదుగా ప్రపంచ క్షయవ్యాధి ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో నౌషాద్, సూపర్‌వైజర్లు భోగ్యం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఉదయగిరిలో ర్యాలీ చేపడుతున్న వైద్యఆరోగ్య సిబ్బంది

## పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తే క్రిమినల్ చర్యలు

● ఎన్నికల అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్

వరికుంటపాడు, మార్చి 22: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులతో సహా వలంటీర్లు, ఉపాధిహామీ సిబ్బంది రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. బీఎల్వోలు సైతం పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రతి ఉద్యోగి రోజువారీ విధులతో పాటు ఎన్నికల విధులను నిర్వర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోను ఓటర్లకు ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు అరుణాదేవి, ఎంపీడీవో వెంకటకృష్ణ కుమారి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజారమేష్ ప్రేమ్‌కుమార్

## మర్రిపాడులో టీడీపీ నాయకుల ప్రచారం

సంగం, మార్చి 22: మర్రిపాడులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంపై శుక్రవారం ముమ్మరంగా ప్రచారం చేశారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. వారివెంట టీడీపీ నాయకులు గొల్లపల్లి హజరత్‌బాబు ఉన్నారు.

## అటవీ శాఖ ఫ్లెక్సీల ఏర్పాటు

ఉదయగిరి, మార్చి 22: ఉదయగిరి అటవీరేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది శుక్రవారం వివిధ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. రేంజ్ పరిధిలోని బస్సు సెంటర్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. అడవుల్లో ప్రయాణించే సమయంలో సిగరెట్, బీడీ తాగరాదన్నారు. వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అడవి జంతవులను వేటాడితే శిక్షార్హుల వుతారన్నారు. అడవుల్లో మద్యం సేవించి ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగిం చరాదన్నారు. పర్యావరణం కలుషితం కాకుండా చూడాలన్నారు.




ఉదయగిరి బస్టాండ్‌లో అటవీ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

# విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

వింజమూరు, మార్చి 22: మండంలోని చెరువుల్లోని మట్టిని కొందరు అక్రమంగా మట్టిని తర లించడం వలన పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయం గా ఉన్నాయి. వానకాలంలో నీరు వచ్చి చెరువులో చేరినా గుంతలతో పంటలకు చేరవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుల్లో కూడా ఇలా పెద్ద గోతు లు ఏర్పాటు చేయడం వలన నీరు ఎక్కడికక్కడే ఇంకిపోతు న్నాయి. వీరికి ప్రభుత్వ స్థలం ఎక్కడ కనపడ్డా కూడా జేసీబీలు పెట్టి టిప్పర్లతో మట్టిని తవ్వి తరలి స్తున్నారు. దీనిపై అధికారులు స్పందించి మట్టి మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరు తున్నారు. ఈ సమస్యతో సామాన్యుడు ఇల్లు కట్టుకోవాలంటే మట్టిని బేస్ మట్టంలో నింపేందుకు నా నా తంటాలు పడాల్సి వస్తుంది. మట్టి మాఫియా ఒక ట్రాక్టర్ మట్టిని రూ.700 నుంచి రూ.వెయ్యి వసూలు చేస్తున్నారు. మట్టి మాఫియా ప్రభుత్వానికి పైసా కట్టకుండా రాత్రి వేళల్లో సెలవుదినాల్లో మట్టిని తరిస్తూ రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు.



చెరువులో మట్టిని తవ్వడంతో ఏర్పడిన గుంతలు





# కమ్ముకున్న కరువు!

● ఒట్టిపోయిన బోర్లు, బావులు, చెరువులు ● బీడుగా మారిన మాగాణి భూములు ● ఎండుతున్న పండ్ల తోటలు

● మూగజీవాలకు పశుగ్రాసం, తాగునీటి కొరత



చుక్క నీరు లేకుండా ఎండిన దాదినీడి చెరువు

వలేటివారిపాలెం, మార్చి 22 : మండలంలో కరువు కరాళ నృత్యం చేస్తోంది. వందలాది మంది కూలీలకు పనులు కల్పిస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న అన్నదాతలు వర్షాలు లేక పదేళ్ల నుంచి కరువు దాటికి విలవిల్లాడుతున్నారు. పంటలు పండక రైతులే కూలీలుగా మారి బతుకు దెరువు కోసం దూరప్రాంతాలకు వలస వెళ్తున్నారు. చుండి, వలేటివారిపాలెం, అయ్యవారిపల్లె అంకభూపాలపురం, కళవళ్ల, నలదలపూరు తదితర గ్రామాలలో చెరువులు వర్షాలు లేక ఎండిపోయాయి. దీంతో ఆయా చెరువుల కింద ఉన్న మాగాణి భూములలో చిల్లచెట్లు పెరిగి బీడు భూములుగా మారాయి. వర్షాలు లేక బోర్లు బావులు ఒట్టిపోయాయి. అలాగే నిమ్మ, బత్తాయి, మామిడి తదితర పండ్ల తోటలు నిలువునా ఎండిపోతున్నాయి. మూగజీవాలు తాగునీరు, పశుగ్రాసం కొరతతో అల్లాడిపోతున్నాయి. రాళ్లపాడు రోళ్లపాడు, చుండి చెర్లోపాలెం రక్షిత మంచీటి పథకాల నుండి పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా లేక నీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పశువులకు పశుగ్రాసం అందజేసి తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.



దాదినీడి చెరువు కింద మాగాణి భూముల్లో చెట్లు

## ముసుగు దొంగలు మళ్లీ హల్‌చల్

● దోపిడీకి యత్నించిన ఇంటికి పట్టపగలే వచ్చి బెదిరింపు

● స్థానికులు అడ్డగించడంతో పరార్

కందుకూరు, మార్చి 22: కందుకూరు పట్టణంలో వారం రోజుల క్రితం ఓ ఇంట్లో దోపిడీకి విఫలయత్నం చేసి ఆ కుటుంబంలోని వారిని కొట్టి గాయపరిచి వెళ్లిన ముసుగు దొంగలు శుక్రవారం మళ్లీ హల్‌చల్ చేశారు. పట్టపగలే ఉదయం 9 గంటల ప్రాంతంలో తిరిగి అదే ఇంటికి వచ్చిన ముసుగుదొంగలు కత్తులతో బెదిరించి నగదు, బంగారం ఇస్తారా చంపేయమంటారా అంటూ హల్‌చల్ చేశారు. చుట్టుపక్కల వారు పరిస్థితిని గుర్తించి ముసుగుదొంగలను ప్రతిఘటించడంతో కత్తులతో బెదిరించి పరారయ్యారు. దోపిడీ దొంగలు ఇంత నిర్భీతిగా వ్యవహరించడంతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతోన్నాయి. పట్టణంలోని కనిగిరి రోడ్డులో నివాసం ఉండే వ్యాపారి కనుమర్లపూడి శివరామకృష్ణ ఇంట్లో ఈనెల 16న అర్ధరాత్రి నలుగురు ముసుగు దొంగలు దోపిడీకి విఫలయత్నం చేసిన విషయం తెలిసిందే. ఆ దొంగల్లోనే ఇద్దరు శుక్రవారం ఉదయం ముసుగులు వేసుకుని మోటారుసైకిల్‌పై వచ్చి ఒకరు రోడ్డుపై ఉండగా మరొకరు మొదటి అంతస్తులోని శివరామకృష్ణ ఇంట్లోకి వెళ్లి కత్తితో బెదిరించి నానా హంగామా చేశాడు. పదిహేను నిమిషాల పాటు ముసుగుదొంగ ఇంట్లో నానా బీభత్సం చేయగా పరిస్థితిని గుర్తించిన చుట్టుపక్కల వారు ఒక్కొక్కరు గుమిగూడి పెద్దగా కేకలు వేసి ప్రతిఘటించడంతో ఆ దొంగ దర్జాగా కిందకు దిగివచ్చి దగ్గరకొస్తే పొడిచేస్తానని కత్తితో బెదిరించి మోటారుసైకిల్‌పై పరారయ్యారు. పట్టపగలు పట్టణ నడిబొడ్డున ఇంత దారుణం జరిగినా దొంగలు పరారయ్యేవరకు పోలీసులు ఆవైపు రాకపోవటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారం రోజులుగా పోలీసు చర్యలు లేకపోవడం వల్లే దోపిడీ దొంగలు పట్టపగలే తెగబడ్డారని ప్రజలు విమర్శిస్తున్నారు. దొంగలు పరారైన మోటారుసైకిల్ నెంబరు ఆధారంగా పరిశీలించగా అది నకిలీ నెంబరని తేలింది.

**ఇంటూరి పరామర్శ :** టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం కనమర్లపూడి శివరామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసులు తక్షణం వారిని అరెస్టు చేయకుంటే రెండు మూడు రోజుల్లో డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ముసుగు దొంగల బరితెగింపుపై బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు తదితరులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



దోపిడీకి యత్నించి పరారవుతున్ననిందితులు

## ప్రతి ఇంటికి పదిసార్లు వెళ్లి ఓటు అడగండి : బీద

● 200 మందికిపైగా టీడీపీలో చేరిక

అల్లూరు, మార్చి 22 : ఎన్నికల సమయానికి ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి పదిసార్లు వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని అభ్యర్థించాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. అల్లూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీపై వ్యతిరేకత ఉందిలే అన్నట్టు నిర్లక్ష్యంగా వ్యవహిస్తే కుదరదని ప్రతి ఓటును కీలకంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బీద రవిచంద్ర, కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి సమక్షంలో మండలంఓని సింగపేట గ్రామానికి చెందిన వైసీపీ కీలక నాయకుడు బండి అమర్‌రెడ్డి తన అనుచరవర్గంతో, అల్లూరు బలిజపాలెంకు చెందిన మంగిశెట్టి సురేష్ ఆధ్వర్యంలో 15 మంది వైసీపీ కార్యకర్తలు, మండలంలోని పలు ప్రాంతాల నుంచి దాదాపు 200 మందికిపైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రూప్‌కుమార్ యాదవ్, వేమిరెడ్డి కోటారెడ్డి, బీద గిరిధర్, బుల్లా కృష్ణారెడ్డి, రఫీమాలిక్, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్ రెడ్డి, మేడా శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పొనకా అర్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన బండి వర్గంతో బీద, కావ్య

### బోడిగుడిపాడు సర్పంచు, మాజీ సర్పంచు...

దగదర్తి,(కావలి) : దగదర్తి మండలం బోడిగుడిపాడు సర్పంచు బొలిగర్ల రత్నం, మాజీ సర్పంచు బత్తల హజరత్తయ్యలు మాలేపాటి సోదరుల ఆధ్వర్యంలో గురువారం రాత్రి టీడీపీలో చేరారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలు వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నాయకులు అల్లం హనుమంతురావు, చేజర్ల ఇబ్రహీం, బొమ్మి సురేంద్ర, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పమిడి రవికుమార్ చౌదరి, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన ఆర్డీవో

బిట్రగుంట, మార్చి 22: బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బోగోలు ప్రాథమిక పాఠశాల, నాగులవరం ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను కావలి ఆర్డీవో శీనానాయక్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దారు వెంకటరత్నం, ఎంపీడీవో జమీ ఉల్లా, ఆర్ఐ వాజీద్, వీఆర్వో కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

## ఒంటరి పోరాటం చేస్తున్నా.. ఆశీర్వదించండి!

అల్లూరు, మార్చి 22 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరి పోరాటం చేస్తున్న నన్ను ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి అల్లూరు పట్టణ పరిధిలోని చాకిరేవుగుంట, చింతగుంట, ఉడ్‌హౌస్‌పేట ప్రాంతాల్లో ఆయన తన సతీమణి శివప్రియతో కలసి ప్రచారం నిర్వహించారు.

## యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన



ముసునూరులో వైసీపీ రంగులు



వాయునందన ప్రెస్‌వీధిలో వైసీపీ జెండాలు

కావలి, మార్చి 22: కావలి పట్టణంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోంది. కోడ్ అమలుకు అధికారపార్టీ అంటే అధికారులకు ఇంకా భయం పోయినట్లు లేదు. 50 ఇళ్లకు ఒక వలంటీరు, ప్రతి ప్రాంతానికి ఒక సచివాలయం, అందులో 10 మంది సిబ్బంది ఉన్నా ఎన్నికల్ కోడ్‌ను అమలు పరచాలంటే ఎందుకో భయపడుతున్నారు. రోడ్ల పైన ఉన్న ఫ్లెక్సీలను మాత్రం తొలగించారు. ఆ తర్వాత కోడ్‌ను అమలు పరచడంలో వెనుకంజ వేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తేనే వాటిని తొలగిస్తున్నారే తప్ప ఎంసీసీ కమిటీ సభ్యులు ఎక్కడా తిరిగి చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు ఉన్నాయి. స్థానిక వాయునందనప్రెస్ వీధిలోని ప్రధాన రోడ్డులో అందరికీ కనిపించేలా ఒక ఇంటిపై వైసీపీ జెండాలు రెపరెపలాడుతున్నా వాటిని తొలగించలేదు. ముసునూరు ట్రంకురోడ్డులో మాహాలక్ష్మమ్మ గుడి పక్కనే ఉన్న ఓ ఇంటి ప్రహరీకి వైసీపీ రంగులు వేసి ఉన్నా, ఆ ఇంటి ముందు పార్టీ జెండా దిమ్మెకు వైసీపీ రంగులు వేసి ఉన్నా పట్టించుకోవటంలేదు.

## కేంద్ర బలగాల కవాతు

లింగసముద్రం, మార్చి 22 : మండలంలోని చినపవని, పెదపవని, ముత్యాలపాడు గ్రామాలలో శుక్రవారం గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం ఎస్సై బాలు మహేంద్రనాయక్, పాల్గొన్నారు.

## కాకర్ల, వేమిరెడ్డిలను గెలిపించండి

జలదంకి, మార్చి 22: టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కాకర్ల సురేష్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని కోరుతూ ఐటీడీపీ నేత ఏగూరి రఘు ఆధ్వర్యంలో టీడీ పీ బూత్ కన్వీనర్లు జలదంకి పంచాయతీలో శుక్రవారం శంఖారావం పేరుతో ఇంటింటి ప్రచారం చేశారు. మహదేవ, రాజా, జెన్నిబాబు, ఇస్మాయిల్, విక్రమ్ పాల్గొన్నారు.

## కందుకూరులో ఇంటింటి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి సౌజన్య, మహిళలు

కందుకూరు, మార్చి 22: తెలుగుదేశం శంఖారావం కార్యక్రమంలో భాగంగా కందుకూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య శుక్రవారం పట్టణంలోని 21వ వార్డు పరిధిలో వెంకయ్యనాయుడు హాస్పటల్ సెంటర్, కాశిదానువారి వీధి ప్రాంతాలలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వడ్లమూడి చెంచునారాయణ, పాకల మల్లికార్జున, వలేటి వెంకటేశ్వర్లు, యోగేశ్వరరావు, చీదెళ్ల పిచ్చయ్య, రాయుడు, సంగా పాండురంగారావు, రమణమ్మ, నారాయణమ్మ, విజయలక్ష్మి, సోమమ్మ పాల్గొన్నారు.

## నన్ను నమ్మండి!

జలదంకి, మార్చి 22: దేవుడి మీద ప్రమాణం చేస్తున్నా.. నన్ను నమ్మండి.. అందరికీ అందుబాటులో ఉంటా.. మళ్లీ మన ప్రభుత్వం వస్తే ఇళ్ల స్థలాల చదును బిల్లులు ఇప్పిస్తానని వైసీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని జమ్మలపాలెంలో జరిగిన ఉదయగిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తానరావు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ పాలవల్లి మాలకొండారెడ్డి, జడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, సొసైటీ అధ్యక్షుడు కేతిరెడ్డి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణక్రాకకు బైక్‌ర్యాలీ నిర్వహించి అక్కడ బహిరంగసభలో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిపై విమర్శలు చేశారు.

## రామాంజనేయులుపై దాడి దుర్మార్గం

కందుకూరు, మార్చి 22: మాజీ ఐఏఎస్ అధికారి, పత్తిపాడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూర్ల రామాంజనేయులుపై వైసీపీ రౌడీమూకలు దాడిచేయడం దుర్మార్గమైన చర్య అని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గోచిపాతల మోషే శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా పట్టించుకోకుండా వైసీపీ అభ్యర్థులు వలంటీర్ల ద్వారా తాయిలాలు పంపిణీ చేయించడాన్ని ప్రశ్నిస్తే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు, నాయకులపై దాడిచేయటం అప్రజాస్వామికమని ఆందోళన వ్యక్తం చేశారు. దాడిచేసిన వైసీపీ రౌడీమూకలను, వారికి సహకరించిన ఆపార్టీ అభ్యర్థి బలసాని కిరణ్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఆర్ఆర్ పాలెంలో వైద్య శిబిరం

లింగసముద్రం, మార్చి 22 : మండలంలోని ఆర్ఆర్ పాలెంలో పది రోజుల నుంచి జ్వరాలు వ్యాపిస్తుండడంతో లింగసముద్రం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికి తిరిగి జ్వరపీడితులను గుర్తించి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని శుక్రవారం కూడా కొనసాగించారు. వైద్యాధికారి డాక్టర్ అనురాధ, సిబ్బంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ నెల 24న జరుగు ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని 16 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార సంచులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సూపర్ వైజర్ శ్రీమన్నారాయణ, సీహెచ్‌వో జి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తల ప్రతిజ్ఞ

బిట్రగుంట, మార్చి 22: బాలింతలు, కిశోర బాలికలు, పిల్లలకు పోషకాహార ప్రాముఖ్యత గురించి తెలియచేయడమే లక్ష్యమని అంగన్వాడీ కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం బోగోలు మండలం చెంచులక్ష్మీపురంలోని అంగన్వాడీ-2 కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు జరిగాయి. పౌష్టికాహారం తీసుకోక పోవడం వలన జరిగే నష్టాలను సూపర్ వైజర్ కోటేశ్వరి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జోత్స్న, ఎంఎల్‌హెచ్‌పీ జాన్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ మాఫియాలో దొరికిపోవడంతో టీడీపీపై అసత్య ప్రచారాలు

కందుకూరు, మార్చి 22: వైజాగ్ పోర్టులో సీబీఐకి దొరికిన దాదాపు రూ.50 లక్షల విలువైన డ్రగ్స్ వెనుక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ విజయసాయిరెడ్డిల హస్తం ఉందని, అడ్డంగా దొరికిపోయామనే భయంతోనే తెలుగుదేశం పార్టీ నేతలపై సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ విమర్శించారు. ఇంటర్‌పోల్ ద్వారా వచ్చిన సమాచారంతో సీబీఐ అధికారులు తనిఖీలు చేస్తుంటే రాష్ట్ర అధికారులు అడ్డుపడాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. దీనివెనుక ఉన్న పెద్దలెవరో బయటకు తీయాలని డిమాండ్ చేశారు. విశాఖను పరిపాలనా రాజధానిగా కాదు డ్రగ్స్‌కు రాజధానిగా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని, డ్రగ్స్ మాఫియా వెనుక ఉన్న విజయసాయిరెడ్డి నెల్లూరు పార్లమెంటుకు పోటీ చేస్తున్నందున ఆయనను ఓడించేందుకు తెలుగుయువత కంకణం కట్టుకుంటుందని పేర్కొన్నారు.

# సార్వత్రిక ఎన్నికల్లో సోమిరెడ్డి విజయం తథ్యం

● గ్రామాల్లో టీడీపీ శ్రేణుల సంబరాలు

**వెంకటాచలం, మార్చి 22:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం తథ్యమని స్థానిక టీడీపీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ అధిష్ఠానం శుక్రవారం విడుదల చేసిన మూడవ జాబితాలో సర్వేపల్లి టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి పేరు ప్రకటించడంతో మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న సోమిరెడ్డి కార్యాలయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

**నేడు గొలగమూడి వెంకయ్యస్వామికి సోమిరెడ్డి పూజలు**

గొలగమూడిలో భగవాన్ వెంకయ్యస్వామి ఆశ్రమాన్ని శనివారం ఉదయం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దర్శించుకోనున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకయ్యస్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. టీడీపీ కార్యకర్తలందరూ విచ్చేయాలని కోరారు.

**సోమిరెడ్డికి తెలుగు తమ్ముళ్ల సన్మానం**

**మనుబోలు:** సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం తథ్యమని టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన మనుబోలుతో పాటు, పలు గ్రామాల్లో తెలుగు తమ్ముళ్ళు సంబరాలు చేసుకున్నారు. మండల నాయకులు అల్లీపురంలోని సోమిరెడ్డి నివాసం చేరుకుని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య, ఉపాధ్యక్షుడు మధునాయుడు, మాజీ కనుపూరు కెనాల్ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు వద్దినేని మస్తాన్‌నాయుడు, మండల సోషల్ మీడియా ప్రతినిధి చల్లగిరి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

**తోటపల్లిగూడూరు:** సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి టికెట్ ఖరారు కావడంతో మండలంలోని కొత్తపాలెం, విలుకానిపల్లి, ముంగలదొరువు, వరిగొండ, నరుకూరు, చింతోపు, పేడూరు, కోడూరు గ్రామాలలోటీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, సోమిరెడ్డి


మనుబోలు: సోమిరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రమోహన్‌రెడ్డిని శుక్రవారం స్థానిక టీడీపీ నేతలు వేదాయపాలెంలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డిని గెలిపించుకుని తీరుతామన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, మన్యం జిత్రేంద, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వీరబోయిన గంగాధర్, రమణారెడ్డి, తాంద్ర మునికృష్ణ, మన్నెం కిరణ్, మొగలిగుంట పోతన, తదితరులు పాల్గొన్నారు.

**అవినీతి మంత్రి కాకాణికి గుణపాఠం తప్పదు**

**పొదలకూరు:** త్వరలో జరగనున్న ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం తథ్యమని, అవినీతి మంత్రి కాకాణికి గుణపాఠం తప్పదని టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షుడు కలగట్ల సందీప్ అన్నారు. శుక్రవారం స్థానిక సంగంరోడ్డు కూడలి వద్ద టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మదిరిశ్ల నరసింహులు, దేవినేని శరత్, కండే సురేష్, తల్లిక ప్రసాద్, బాలచంద్ర, సాధం గిరి, సొరకొండ వెంకటేష్, దేవినేని నాగేశ్వరరావు, నవీన్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**ముత్తుకూరు:** మండలంలోని పంటపాలెంలో టీడీపీ నాయకుడు యదనపర్తి శ్యామ్‌రెడ్డి ఆధ్వర్యంలో, బ్రహ్మదేవంలో ఐటీ విభాగం నాయకుడు తిరుమలశెట్టి సతీష్‌నాయుడు, వల్లూరు మోహన్‌రావు, ముత్తుకూరు ప్రధాన కూడలిలో పట్టణ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సోమిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి సర్వేపల్లి విజయాన్ని చంద్రబాబుకు కానుకగా ఇస్తామన్నారు.

## మహిళలకు శిక్షణ తరగతులు

**వెంకటాచలం, మార్చి 22 :** మండలంలోని అనికే పల్లి గ్రామంలో శాలివాహన డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వ ర్యంలో మహిళలకు హ్యాండ్ ఎంబ్రాయిడింగ్, పెయింటింగ్, డిజైనింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు శాలివాహన సాధికారత కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ఆదిశేషయ్య తెలిపారు. అనికేపల్లిలో శుక్రవారం శాలివాహన సాధికారత కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడు యడవల్లి మల్లికార్జున్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టం బ్రహ్మయ్య, సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు చల్ల గిరి వరప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు సుమతి, తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్య సురక్ష కార్యక్రమం పరిశీలన

**ఇందుకూరుపేట, మార్చి 22:** జిల్లా ప్రజాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్, 104 నోడల్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్ పరిశీలించారు. అనంతరం ఆయన డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ కనకరత్నంతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్కానింగ్ సెంటర్‌ను సందర్శించి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సునీల్‌తో చర్చించారు. కాగా, జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ బ్రహ్మేశ్వర్‌నాయుడు, డాక్టర్ సి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించగా ఎంపీడీవో పి సాయిలహరి పర్యవేక్షించారు. ఈ వైద్యశిబిరంలో 524 మందికి ఆరోగ్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈదూరి పద్మమ్మ, హెచ్ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్ రమా, సతీష్‌బాబు, ఫార్మసిస్ట్ చంద్రశేఖర్, పంచాయతీ సెక్రటరీ పి.మల్లికార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత, పాల్గొన్నారు.

## ప్రశాంతిరెడ్డిని విమర్శిస్తే సహించం

**విడవలూరు, మార్చి 22:** కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని విమర్శిస్తే సహించమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య అన్నారు. విడవలూరులో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవినీతికి, అక్రమాలకు కేరాఫ్ అయిన ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశాంతిరెడ్డిపై విమర్శలు చేయటం విడ్డూరమన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మాతూరు శ్రీనివాసులరెడ్డి, చెముకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ మహిళా నాయకురాళ్లు చలంచర్ల కామేశ్వరి, భవానమ్మ మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తే ప్రసన్నకుమార్‌రెడ్డి నాలుక కోస్తామని అన్నారు. వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డిపై ప్రసన్న చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. రానున్న ఎన్నికల్లో మహిళా శక్తి ఏమిటో చూపిస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు చెముకుల కృష్ణ చైతన్య

**ప్రసన్నకుమార్‌రెడ్డికి గుణపాఠం తప్పదు**

**కొడవలూరు :** కోవూరు టీడీపీ శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని విమర్శించే అర్హత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి లేదని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అన్నారు. మండలంలో నార్తురాజుపాళెంలో పీఎస్ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లగా కోవూరు నియోజకవర్గం అరాచకాలకు అడ్డాగా మారిందన్నారు. కోవూరు ప్రశాంతంగా ఉండాలంటే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమన్నారు. ఈ ఎన్నికలలో నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు. శాసన సభ్యురాలుగా వేమిరెడ్డి ప్రశాంతిని, ఎంపీ వేమిరెడ్డి ప్రబాకర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**కమనీయం కామాక్షితాయి కల్యాణం**

**బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 22:** జొన్నవాడ ఆలయంలో శుక్రవారం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామి నిత్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన అనంతరం పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగించారు,

**వైభవంగా మహాలక్ష్మమ్మ కల్యాణం**

మండలంలోని చెల్లాయపాళెంలో మహలక్ష్మమ్మ, మహావిష్ణువు కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. మహలక్ష్మమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కల్యాణం అనంతరం స్వామి, అమ్మవారు గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

## హనుమంతుడిపై వేణుగోపాలుడి దర్శనం



మండలంలోని పంచేడు గ్రామంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం వేణుగోపాలుడు హనుమంతు వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. పెనాక అమరనాథరెడ్డి, అనిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వేణుగోపాలస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**సౌత్‌మోపూరులో కోటంరెడ్డి కుటుంబం ప్రచారం**

**నెల్లూరు(సిటీ) :** మండలంలోని సౌత్‌మోపూరులో టీడీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఆయన సతీమణి సుజిత, కుమార్తెలు వైష్ణవి, హైందవి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందచేసి ఓటును అభ్యర్థించారు.

**ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ**

**వెంకటాచలం, మార్చి 22:** కాకుటూరు గ్రామంలో శుక్రవారం విక్రమ సింహపురి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ కే విద్యాప్రభాకర్, డాక్టర్ ఏ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

**వాహనాల తనిఖీ**

**బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 22:** స్థానిక జాతీయ రహదారి టోల్ గేట్ వద్ద వాహన తనిఖీలు చేపడుతున్నట్టు సీఐ హైమారావు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ డీఎస్పీ పర్యవేక్షణలో వాహన తనిఖీలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనధికారికంగా మద్యం, నగదు, గంజాయి లాంటి వస్తువులు రవాణాచేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

**టెన్త్ పరీక్షలకు 93 మంది గైర్హాజరు**

బుచ్చిరెడ్డిపాళెంలో శుక్రవారం జరిగిన 10వ తరగతి లెక్కలు (గణితశాస్త్రం) పరీక్షలకు 93 మంది గైర్హాజరయ్యారు. మండలంలో మొత్తం 7 పరీక్షా కేంద్రాలలో మొత్తం 1216 మంది విద్యార్థులకు గాను 1123 మంది హాజరైనట్లు సీఆర్‌పీ మల్లేశ్వరరెడ్డి తెలిపారు.



# నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి



## సేవాభావంతోనే రాజకీయాల్లోకి..

● ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతి, పొంగూరు రమాదేవి

**నెల్లూరు (వైద్యం), మార్చి 22 :** టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ నమ్మకానికి మారుపేరని, సేవాభావంతోనే రాజకీయాల్లోకి వచ్చారని కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సిటీ అభ్యర్థి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి వెల్లడించారు. శుక్రవారం వారిద్దరు కలిసి 16వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని చేపట్టారు, ఇంటింటికి తిరిగి వేమిరెడ్డిని, నారాయణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తాళ్లపాక అనూరాధ, అంచూరు జానకి, జనసేన నాయకుడు గునుకుల కిశోర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో ప్రశాంతిరెడ్డి, రమాదేవి

## టీడీపీలో యువతకు మంచి భవిష్యత్తు

● మాజీ మంత్రి, టీడీపీ నేత నారాయణ

**నెల్లూరు (వైద్యం), మార్చి 22 :** తెలుగుదేశం పార్టీతోనే యువతకు మంచి భవిష్యత్తు ఉందని మాజీ మంత్రి, టీడీపీ నెల్లూరు సిటీ అభ్యర్థి పొంగూరు నారాయణ వెల్లడించారు. శుక్రవారం గోమతినగర్‌లోని నారాయణ క్యాంపు కార్యాలయంలో నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 49వ డివిజన్‌కు చెందిన పలువురు యువత టీడీపీలో చేరారు. వారికి నారాయణ పార్టీ కండవా వేసి ఆహ్వానించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పేర్కొన్నారు. యువత సైకిల్ గుర్తుకే ఓటేయాలని కోరారు.


వీడియో విడుదల చేస్తున్న నారాయణ

**మన సింహపురి - మన నారాయణ వీడియో రిలీజ్**

**నెల్లూరు (సాంస్కృతికం):** టీడీపీ సిటీ అభ్యర్థి నారాయణ ఎన్నికల ప్రచారం కోసం రూపొందించిన మన సింహపురి - మన నారాయణ వీడియోను శుక్రవారం నారాయణ విడుదల చేశారు. ఈ పాటను యువ రచయిత మురళీమోహన్‌రాజు రచించారు. నారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనురాధ, విజేతరెడ్డి పాల్గొన్నారు.

## రాజధానిలేని రాష్ట్రంగా మార్చిన ఘనత జగన్‌ది

● రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి

**నెల్లూరు(వ్యవసాయం), మార్చి 22 :** దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కు దక్కుతుందని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో శుక్రవారం 20, 21 డివిజన్ల యువతతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ నగరాలతో పోటీపడే విధంగా మన రాజధాని అమరావతిని నిర్మిస్తారని తెలియజేశారు.


చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న కేఎస్ఆర్

**టీడీపీలో కేఎస్ఆర్ చేరిక**

నెల్లూరు రూరల్ ప్రాంతం 12వడివిజన్ ధనలక్ష్మీపురానికి చెందిన కుడుముల నాగేశ్వరరావు గౌడ్ (కేఎస్ఆర్) శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు చంద్రబాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. కాగా, రూరల్ నియోజకవర్గ పరిధి కొండ్లపూడికి చెందిన వార్డు మెంబరు ఇరగ వెంకటేశ్వర్లు, మల్లి, ఏడుకొండలు వారి మిత్ర బృందం శుక్రవారం ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిల సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకుడు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో బుచ్చికి చెందిన వైసీపీ సీనియర్ నేత తిరువైపాటి నందకుమార్, సౌత్ ఇండియన్ బలిజ సంఘం అధ్యక్షుడు మున్నా శ్రీనివాసులు, వెంగపాటి మాల్యాద్రి, కంచి రజినీ కాంత్, బడుగు శ్రీనివాసులు తదితరులు టీడీపీలో చేరారు.

## పొత్తు గెలవాలి... ప్రభుత్వం మారాలి

● జనసేన నాయకుడు కిషోర్

**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 22:** రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రజలు విసిగి పోయారని, రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పడిన పొత్తు గెలవాలని ప్రభుత్వం మారాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ పిలుపునిచ్చారు. సుబేదారుపేటలోని జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సొంత ప్రయోజనాల కోసం కాకుండా రాష్ట్ర ప్రజలను అరాచక పాలన నుంచి కాపాడాలనే ఉద్దేశంతోనే జనసేన, తెలుగుదేశం, బీజేపీలు ఏకమయ్యాయన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, శరవణ, షాజహన్ తదితరులు పాల్గొన్నారు.

## పన్ను చెల్లించలేదని కొళాయి కనెక్షన్ కట్

**నెల్లూరు(సిటీ), మార్చి 22 :** కార్పొరేషన్‌కు ఇంటి పన్ను చెల్లించని పలు ఇళ్లకు తాగునీటి కొళాయి కనెక్షన్‌ను నగర పాలక సంస్థ అధికారులు తొలగించారు. శుక్రవారం నగరంలోని పోలీసుకాలనీలో పలు ఇళ్లకు రూ.57 వేల వరకు ఇంటి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. అవి మొండి బకాయిగా తేలడంతో పన్ను చెల్లించాలని ఎన్నిసార్లు హెచ్చరిక నోటీసులు జారీ చేసినా ఫలితం లేనందున చివరిగా కొళాయి కనెక్షను తొలగించినట్లు కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఇప్పటికీ స్పందించకుంటే ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు.

**నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు**

**నెల్లూరు(జడ్పీ), మార్చి 22:** నగరంలోని శెట్టిగుంట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు మరమ్మతులు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బృందావనం బీఎస్ నగర్, మంగళదిబ్బ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

**25న సత్యనారాయణ వ్రతం**

**నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 :** పాల్గుణ పౌర్ణమి సందర్భంగా ఈనెల 25న నగరంలోని మహాత్మా గాంధీనగర్ శ్రీకృష్ణమందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుందని మందిరం కమిటీ తెలిపింది. పాల్గొనదలచిన భక్తులు సంప్రదించాలని కోరింది.

## వీపీఆర్‌తో ఆనం రామనారాయణ భేటీ

**నెల్లూరు (హరనాథ పురం), మార్చి 22 :** రాజ్య సభ సభ్యుడు, టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతో శుక్ర వారం వారి నివాసంలో ఆత్మ కూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి భేటీ అయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై సమాలోచన చేశారు.


వేమిరెడ్డి దంపతులతో రామనారాయణరెడ్డి

**అల్లూరు మండల నాయకులు...**

అల్లూరు మండలానికి చెందిన నాయకులు శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆధ్వర్యంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. మండలంలోని తూర్పు గోగులపల్లికి చెందిన సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, కాంతారావు, భాస్కర్, వెంకటేశ్వర్లు, శివ, స్వరూప్, ఓరంపాటి శ్రీనివాసులు తదితరులు వేమిరెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

## ఉపాధ్యాయ ఉద్యమాల్లో చిరస్మరణీయుడు అప్పారి

● మాజీ ఎమ్మెల్సీ విఠపు

**నెల్లూరు (విద్య), మార్చి 22 :** ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాణంలో అలుపెరగని పోరాటం చేసిన అప్పారి వెంకటస్వామి చిరస్మరణీయుడని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం అప్పారి 23వ వర్ధంతి సభ జరిగింది. ఇందులో పాల్గొన్న విఠపు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగంలో, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో నాటి ప్రభుత్వాల నిరంకుశ విధానాలను ఎండగట్టేందుకు యూటీ ఎఫ్ ఆవిర్భవించిందని చెప్పారు. ఆవిర్భావ ప్రధాన కార్యదర్శిగా సంఘం నిర్మాణంలోనూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలోనూ, విద్యారంగ పరిరక్షణలోనూ రాజీలేని పోరాటాలను వెంకటస్వామి నడిపారన్నారు. సంఘం కోసం జీవితాన్ని అర్పించారన్నారు. నేటితరం ఉపాధ్యాయులు, నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీ ఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పీ బాబురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎన్ నవకోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ చలపతి శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీ రమాదేవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎంసీ అచ్చయ్య, కోశాధికారి ఏ మురళీధర్‌రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

## రత్నంకు విద్యార్థుల నివాళి

**నెల్లూరు (విద్య), మార్చి 22 :** డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల ఆధ్వర్యంలో నగరంలోని సరస్వతి నగర్ రత్నం పాఠశాలలో శుక్రవారం విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీ రత్నంకు విద్యార్థులు నివాళులర్పించారు. విద్యార్థులంతా రత్నంసార్ అనే అక్షరరూపంలో ఏర్పడి వందనం చేశారు. సిబ్బంది మౌనం పాటించి పుష్పాంజలి ఘటించారు. విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాళ్లు మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర, అధ్యాపకుడు రాజేంద్రబాబు, టీచర్లు పాల్గొన్నారు.



అక్షర రూపంలో నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

## 1994 టీడీపీ చరిత్ర పునరావృతం

● ప్రచారసభలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

**పొదలకూరు, మార్చి 22 :** టీడీపీ 1994లో భారీ మెజారిటీ సాధించిందని, అప్పట్లో తన మెజారిటీ 33,500 అని, అదే ఫలితాలు రానున్న ఎన్నికల్లో పునరావృతమవుతాయని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని నరసారెడ్డికాలనీ, విఘ్నేశ్వర కాలనీలో తొలిసారి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం వైసీపీ నుంచి 15 కుటుంబాలు టీడీపీలో చేరగా వారికి సోమిరెడ్డి కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సోమిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మళ్లీ జైలుకు వెళ్లక తప్పదని, అదేబాటలో కాకాణి జైలు ఊచలను లెక్కపెడతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్ నాయుడు, కొండపల్లి వెంకటేశ్వర్లు, సొరకొండ వెంకటేష్, సాదం గిరి, జగదీష్, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, జమీర్, కృష్ణయ్య, మహిళా మండల అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు

## కలెక్టర్ ఎన్నికల కేంద్రాల పరిశీలన


బుచ్చి : ఏఈఆర్వోలకు సూచనలిస్తున్న జేసీ

**విడవలూరు,(కోవూరు)/బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 22:** త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విడవలూరు మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం కలెక్టరు హరినారాయణన్ పరిశీలించారు. ఓటర్లకి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సేతుమాధవ్, తహసీల్దారు విజయశ్రీ పాల్గొన్నారు. కాగా, బుచ్చి నగర పంచాయతీలోని డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ హైస్కూల్లో ఉన్న 11 సముదాయ పోలింగ్ బూత్‌లను శుక్రవారం జేసీ సేతుమాధవన్ ఈఆర్వో శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఒకే ప్రాంతంలో ఎక్కువ పోలింగ్ బూత్‌లు ఉండటంతోపాటు సుమారు 8వేలమంది అక్కడ ఓటుహక్కు వినియోగించుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో వసతుల కల్పనపై ఏఈఆర్వోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కమిషనర్ రమణబాబు, స్వీప్ నోడల్ అధికారి పీ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

**శిలాఫలకాలు ఇంతేనా..?**

**సైదాపురం, మార్చి 22:** ఎన్నికల కోడ్ అమలులో ఉన్న తహసీల్దార్ కార్యాలయంలో శిలాఫలకాలకు ఎన్నికల కోడ్ వర్తించడం లేదు. కార్యాలయ శంకుస్థాపన, ప్రారంభం నాటి శిలాఫలకాలకు మూత వేయలేదు. వీటికి కోడ్ వర్తించదా అని పలువురు చర్చించుకుంటున్నారు.







# లక్ష్మీనృసింహుడి సేవలో ....



దక్కిలి, మార్చి 22: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు శుక్రవారం వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని పెంచకోనలో వెలసిన లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్నారు. రాపూరు మండలం గోనుపల్లె వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు సాయంత్రం 3.30 గంటలకు హెలికాప్టర్‌లో చేరుకున్న చంద్రబాబు ఐదు నిమిషాల పాటు ప్రముఖులను పలకరించాక సంప్రదాయ దుస్తులతో కారులో బయల్దేరి 4 గంటలకు పెంచలకోనకు చేరుకొన్నారు. స్వామివారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకుని గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి ఆలయంలోకి ప్రవేశించారు.స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.చంద్రబాబు గోత్రనామాలతో అర్చకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆదిలక్ష్మీ దేవి, ఆంజనేయ స్వామి ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి చంద్రబాబుకు అర్చకులు వివరించారు.ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు టీడీపీ నేతలు , శ్రేణులు చంద్రబాబుకోసం పెంచలకోనకు చేరుకున్నారు. మాజీ మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పనబాక లక్ష్మి, పరసా వెంకటరత్నం, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల సుబ్రమణ్యం, సుగుణమ్మ,హేమలత, వెంకటగిరి, సూళ్ళూరుపేట టీడీపీ అభ్య



ర్థులు లక్ష్మీసాయిప్రియ, నెలవల విజయశ్రీ, తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, వేనాటి సతీష్ రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, కోటంరెడ్డి గిరిధర రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, తెలుగు యువత కార్యదర్శి కేవికే ప్రసాద్ నాయుడు, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు. పప్పు చంద్రమౌళి రెడ్డి, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాథ నాయుడు, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, సోమయ్య, జర్ని రమణయ్య, రుద్రకోటి సదాశివం, దందవోలు వెంకటేశ్వర్లు రెడ్డి, ఏదోటి కోటేశ్వర నాయుడు, కె.రాఘవరెడ్డి, ఖాజా, సీసీ నాయుడు, రావి సత్యం, మస్తాన్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు. 4.30 గంటల ప్రాంతంలో చంద్రబాబు తిరుగు పయనమయ్యారు.

# చిల్లకూరులో నారా భువనేశ్వరి

గూడూరు/చిల్లకూరు, మార్చి 22: నిజం గెలవాలి యాత్రలో భాగంగా శుక్రవారం సాయంత్రం గూడూరు నియోజకవర్గం తిప్పవరప్పాడు ప్రాంతానికి టీడీపీ అధినేత చంద్రబాబు భార్య నారా భువనేశ్వరి చేరుకున్నారు.కడప జిల్లా బద్వేలు నుంచి కారులో వచ్చిన ఆమెకు మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌తో పాటు టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు స్వాగతం పలికారు.అక్కడినుంచి రాత్రి బస చేసేందుకు ఆమె చిల్లకూరులోని ఏ-5 హోటల్‌కు చేరుకున్నారు. శనివారం ఉదయం 9గంటలకు ఏ-5 హోటల్‌లో మహిళలతో భువనేశ్వరి ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు.తరువాత వాకాడు మండలం లోని తిరుమూరు గ్రామంలో చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతిచెందిన వెంకటస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేయనున్నారు. తరువాత సర్వేపల్లి నియోజకవర్గంలో జరగనున్న కార్యక్రమానికి వెళతారురు.టీడీపీ నేతలు రవినాయుడు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భువనేశ్వరికి తెలుగు మహిళల స్వాగతం



# చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా దగ్గుమళ్ల

## ● ప్రసాదరావు పేరు ప్రకటించిన టీడీపీ

చిత్తూరు, మార్చి 22 (ఆంధ్ర జ్యోతి): చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావును టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసింది. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన కొన్నాళ్లుగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ప్రసాదరావును చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేయనున్నట్లు ఈనెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం విడుదల చేసిన అభ్యర్థుల మూడో జాబితాలో ఆయన పేరును టీడీపీ ప్రకటించింది. చిత్తూరు పార్లమెంటు పరిధిలో కుప్పం నియోజకవర్గం ఉండడం.. అక్కడ ప్రతిసారీ చంద్రబాబుకు అత్యధిక మెజార్టీ రావడం.. వంటి కారణాలతో ఇక్కడి నుంచి పోటీ టీడీపీ అభ్యర్థి కచ్చితంగా గెలుస్తూ వస్తున్నారు. 2019 ఎన్నికల్లో మాత్రం అప్పటి వేవ్ కారణంగా వైసీపీ అభ్యర్థి రెడ్డెప్ప చేతిలో శివప్రసాద్ ఓటమి చెందారు. ఆ తర్వాత అనారోగ్యంతో ఆయన మరణించారు. అప్పట్నుంచి చిత్తూరు ఎంపీ స్థానం ఎవరికి కేటాయిస్తారా అన్న ఆసక్తి శ్రేణుల్లో నెలకొంది. సినీ నటుడు సప్తగిరి ఎంపీ టికెట్ కోసం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ద్వారా ప్రయత్నాలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఆ తర్వాత జీడీనెల్లూరు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎస్పీ (కేంద్ర భద్రతా దళం) పీసీ స్వామి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరి ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. చివరిగా మాజీ ఐఆర్ఎస్ అధికారి ప్రసాదరావు తెరపైకి వచ్చారు. ఈయన ఐఆర్ఎస్ అధికారిగా 2019లో ముందస్తు పదవీ విరమణ పొంది తన కుమారుడు రాధే పేరుతో హైదరాబాదులో కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ స్థాపించారు. ముందుగా బాపట్ల ఎంపీ స్థానం కోసం ప్రయత్నించిన ఆయన.. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశంతో చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. పది రోజులుగా చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గవ్యాప్తంగా పర్యటించి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి ప్రచారాల్లో పాల్గొంటున్నారు.

**పూర్తి పేరు:** దగ్గుమళ్ల ప్రసాదరావు
**పుట్టినతేది:** 09.01.1962
**తల్లిదండ్రులు:** దివంగత సుశీలమ్మ, దివంగత లూకే
**కుమారుడు:** రాధే (ఎండీ, రాధే కన్‌స్ట్రక్షన్ కంపెనీ)
**సొంతూరు:** చింతగుంపల్లె గ్రామం, చిన్నగంజాం మండలం, బాపట్ల జిల్లా
**బ్యాచ్‌లర్ ఇన్ జర్నలిజం:** ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్
**పీజీ ఇన్ ఆర్ట్స్ అండ్ పొలిటికల్ సైన్స్:** సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాద్
**ఉద్యోగం:** ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో మాజీ జాయింట్ కమిషనర్ (ఐఆర్ఎస్ అధికారి). 2019లో ముందస్తు పదవీ విరమణ పొంది రాధే కన్‌స్ట్రక్షన్ కంపెనీ చైర్మన్‌గా ఉంటున్నారు.



వైసీపీ ప్రచారంలో టీటీడీ ఉద్యోగి నగేష్

# వేటు పడుతున్నా కోడ్‌ను ఖాతరు చేయరా?

● వైసీపీ ప్రచారంలో టీటీడీ ఉద్యోగి ● జనసేన అభ్యర్థిని కలిసిన రుయా ఉద్యోగి

● 4రోజుల్లోనే ఆరుగురు వలంటీర్ల తొలగింపు ● శ్రీకాళహస్తి ఆర్టీసీ కండక్టర్‌పై విచారణ

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నియమావళిని కొందరు ఉద్యోగులు బేఖాతరు చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులను కలవడం, వారికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించడం, మద్దతు తెలపడం, ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడం వంటి తప్పిదాలకు పాల్పడుతున్నారు.తిరుపతి వైసీపీ అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డి శుక్రవారం నాటి ఎన్నికల ప్రచారంలో పార్టీ నేతలతో పాటు టీటీడీ ప్రజా సంబంధాల విభాగం ఓఎస్డీ నాగేశ్వర రావు అలియాస్ నగేష్ పాల్గొన్నారు.టీటీడీలో విధులు నిర్వర్తిస్తూ ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా అధికార పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం తీవ్ర విమర్శలకు దారి తీసింది.తిరుపతి జనసేన పార్టీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులును రుయాస్పత్రి నాన్ మెడికల్ విభాగం అడ్మిన్‌గా పనిచేస్తున్న టి.ఉమామహేశ్వర్ గురువారం రాత్రి ఒక హోటల్‌లో కలిశారు. రుయాలో పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, ఎస్ఏబీహెచ్ వంటి అంశాలను ఆయన పర్యవేక్షిస్తుంటారు. కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఆయన జనసేన పార్టీ అభ్యర్థిని కలవడంపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఎన్నికల నియమావళి నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా ఇతడిపై అధికారులు చర్య తీసుకునే అవకాశముంది. ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యాక గత 18వ తేదీ నుంచీ ఇప్పటి దాకా నాలుగు రోజుల స్వల్ప వ్యవధిలోనే ఏర్పేడు, రేణిగుంట మండలాలకు చెందిన ఆరుగురు వలంటీర్లు ఉద్యోగం కోల్పోయారు. ఏర్పేడు మండలం మడిబాకలో సోమవారం వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన రెడ్డి కుమార్తె పవిత్ర నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీరు మురళి పాల్గొన్నారు. దీనిపై ఫిర్యాదులందడంతో మంగళవారం ఎంపీడీవో అతన్ని తొలగించారు.అదే మండలం రావిళ్ళవారి కండ్రిగలో గురువారం సాయంత్రం పవిత్ర నిర్వహించిన ప్రచారంలో వలంటీర్లు గీత, లత పవిత్ర పాల్గొనడం పట్ల ఫిర్యాదులు రావడంతో నిర్ధారించుకున్న ఎంపీడీవో శుక్రవారం వారిద్దరినీ తొలగించారు. ఈ మండలంలోనే ఆమందూరుకు చెందిన వలంటీరు చెంచు మణి, మేర్లపాక పంచాయతీ కొత్త కండ్రిగకు చెందిన వలంటీరు దర్శిక్ రెండు రోజుల కిందట తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరి చేరిక గురించి మీడియాలో రావడంతో పాటు వైసీపీ వర్గీయులు ఫిర్యాదు చేయగా ఎంపీడీవో శుక్రవారం ఇద్దరినీ తొలగించారు. దీంతో ఏర్పేడు మండలంలోనే నాలుగు రోజుల వ్యవధిలోనే ఐదుగురు వలంటీర్లు ఎన్నికల నియమావళి ఉల్లంఘించి విధుల నుంచీ తొలగించబడ్డారు. ఇక రేణిగుంట మండల కేంద్రంలోని నాల్గవ సచివాలయ పరిధికి చెందిన వలంటీరు మస్తాన్ గత బుధవారం పలువురు ముస్లిం మైనారిటీలను శ్రీకాళహస్తికి తీసుకెళ్ళి వైసీపీలో చేర్పించారు. ఈ విషయాన్ని వైసీపీ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో అదే రోజు అతన్ని విధుల నుంచీ తొలగించారు.ఏర్పేడు మండలం రావిళ్ళవారి కండ్రిగలో గురువారం పవిత్ర చేపట్టిన ఎన్నికల ప్రచారంలో శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ మురళి పాల్గొన్నారు. దీనిపై ఫిర్యాదులు వెళ్లడంతో విచారణ జరిపి నివేదిక అందజేయాల్సిందిగా ఆర్డీవోను ఆర్టీసీ అధికారులు కోరారు. ఈలోపు అతనికి డ్యూటీలు కేటాయించకుండా ఖాళీగా వుంచారు. శనివారం ఆర్డీవో నుంచీ నివేదిక అందగానే కండక్టర్‌పై సస్పెన్షన్ వేటు పడే అవకాశముంది.



జనసేన అభ్యర్థి శ్రీనివాసులుతో రుయా ఉద్యోగి ఉమామహేశ్వర్

# కాలికి గాయమై వస్తే హెచ్ఐవీ వుందన్నారు!

● రుయాస్పత్రి ల్యాబ్ సిబ్బంది తప్పుడు రిపోర్టుతో వైద్యులు ఆపరేషన్ చేయలేమన్నారు

● కుంగిపోయానంటూ సూపరింటెండెంటుకు ఎర్రావారిపాళెం యువకుడి ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), మార్చి 22 : రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రికి వస్తే చికిత్సలో భాగంగా చేసిన రక్త పరీక్షల్లో హెచ్ఐవీ పాజిటివ్ అని తప్పుడు రిపోర్టు ఇచ్చి చికిత్స చేయకుండా ఇబ్బందులకు గురి చేయడంపై బాధితుడు రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.బాధితుడి కథనం మేరకు ఎర్రావారిపాళెం మండలానికి చెందిన ఓ యువకుడు ఈ నెల 13న రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాలికి తీవ్రగాయం కావడంతో కుటుంబ సభ్యులు రుయాస్పత్రిలో అడ్మిట్ చేయించారు. కాలికి సర్జరీ చేయాలన్న వైద్యులు రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదే రోజు ఆస్పత్రిలోని ల్యాబ్‌లో రక్త నమూనాలు ఇవ్వడంతో సిబ్బంది పరీక్షలు నిర్వహించి మరుసటి రోజు రిపోర్టు ఇచ్చారు. అందులో హెచ్ఐవీ పాజిటివ్ అని ఉండడంతో ఆ యువకుడు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యాడు.అనుమానం వచ్చి అదేరోజు పక్కనే స్విమ్స్‌లో రక్త పరీక్షలు చేయించగా అక్కడ హెచ్ఐవీ నెగటివ్ వచ్చింది. ఆ రిపోర్టును తీసుకువచ్చి రుయాస్పత్రి వైద్యులకు చూపించి తనకు వెంటనే సర్జరీ చేయాలని కోరినా వారు పట్టించుకోలేదని బాధితుడు వాపోయారు. తిరిగి రుయాస్పత్రిలో ఈ నెల 20న రక్త పరీక్ష చేయించగా అందులో హెచ్ఐవీ నెగటివ్ వచ్చింది. మొదట ఇచ్చిన తప్పుడు రిపోర్టు వలన తన కుమారుడు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడని, దీనికి తప్పుడు రిపోర్టు ఇచ్చిన రుయాస్పత్రి సిబ్బందే కారణమని బాధిత యువకుడి తండ్రి వాపోయాడు.దీనిపై విచారించి చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ రవిప్రభును శుక్రవారం కోరారు.

## మద్యం తరలిస్తూ దొరికిపోయారు!

**ఇద్దరు సేల్స్‌మేన్, ఇద్దరు ట్రాన్స్‌పోర్టర్ల అరెస్టు**

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22 : తిరుపతి రూరల్ మండలం తనపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం తరలిస్తున్న నలుగురిని శుక్రవారం సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.40వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. సెబ్ రూరల్ సీఐ భీమలింగం సిబ్బందితో కలసి మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. తనపల్లి దుకాణంలో పనిచేస్తున్న బండి అబ్దుల్ రెహ్మాన్, ఎస్. రాజా శుక్రవారం 102 రాయల్ ప్యాలెస్ క్వార్టర్ బాటిళ్లను యుగంధర్, చెంజి సుబ్రహ్మణ్యం ద్వారా స్కూటీలో తిరుచానూరుకు తీసుకెళుతున్నారు. సెబ్ అధికారులు తనపల్లి ఐస్ ఫ్యాక్టరీ వద్ద వారిని పట్టుకుని మద్యం స్వాధీనం చేసుకున్నారు.

## 27న ప్రజాసంకల్పయాత్ర

● పలమనేరు నుంచి చంద్రబాబు ప్రారంభిస్తారన్న అమర్

పలమనేరు, మార్చి 22:టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాసంకల్పయాత్రను ఈనెల 27వ తేది పలమనేరు నుంచి ప్రారంభిస్తారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు నియోజకవర్గం నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని, అందులో స్థానిక, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు లిఖితపూర్వకంగా తెలియజేసేందుకు వీలుంటుందన్నారు.టీడీపీ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తుందని అమరనాథరెడ్డి వివరించారు.

**రంజాన్ వేళలు**
ఇఫ్తార్ (శనివారం) : సా. 6.27
సహరి (ఆదివారం) : ఉ. 4.55

## రెండు గంటలు ఆలస్యంగా ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్

తిరుపతి సెంట్రల్ మార్చి22 : తిరుపతి-నిజాముద్దీన్ స్టేషన్ల మధ్య నడిచే ఏపీ సంపర్క్ క్రాంతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. నిజాముద్దీన్ నుంచి తిరుపతికి చేరుకున్న ఈ ఎక్స్‌ప్రెస్‌కు మరమ్మతులు చేసే సమయంలో రెండు జనరల్ కోచ్‌లు రవాణాకు ఉపయోగపడవని కోచ్ అండ్ వ్యాగన్ శాఖ అధికారులు నిర్ధారించారు.ప్రత్యామ్నాయ బోగీలను సకాలంలో ఏర్పాటుచేయకపోవడంతో తిరుపతి నుంచి 21 పెట్టెలకు బదులు 19 పెట్టెలతోనే రైలు బయల్దేరింది. తద్వారా దాదాపు 200 మంది ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు బయలుదేరాల్సిన ఈ ఎక్స్‌ప్రెస్ 7.45 గంటలకు బయలుదేరినట్లు అధికారులు తెలిపారు.








తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తెప్పోత్సవాల్లో భాగంగా రెండురోజుల పాటు శ్రీరామ, శ్రీకృష్ణ రూపాల్లో దర్శనమిచ్చిన శ్రీవారు మూడో రోజైన శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిగా తెప్పపై భక్తులను కటాక్షించారు.అంతకుముందు ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో తెప్పపై కొలువుదీర్చారు. విద్యుద్దీపాల వెలుగులు, వేదం, నాదం, గోవిందనామస్మరణల మధ్య తెప్పపై శ్రీవారు విహరించారు. శనివారం ఐదుచుట్లు, ఆదివారం ఏడుచుట్లు పుష్కరిణిలో తెప్పపై మలయప్ప స్వామి విహరించనున్నారు.

# అండర్ బ్రిడ్జి నిర్మించండి



జాతీయ రహదారిని దాటుతున్న వాహనాలు

గూడూరు, మార్చి 22: స్థానిక పోటుపాళెం జాతీయ రహదారి కూడలి వద్ద అండర్ బ్రిడ్జి లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి రావాలన్నా, పట్టణంలో నుంచి నెల్లూరుకు వైపునకు, నాయుడుపేట వైపు వెళ్లాలన్నా పోటుపాళెం జాతీయ రహదారి కూడలి నుంచే వెళ్లాల్సి వుంటుంది. ఈ కూడలి వద్ద నెల్లూరు వైపు నుంచి చెన్నై వైపునకు, చెన్నై వైపు నుంచి నెల్లూరు వైపునకు వెళ్లే వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. గూడూరు పరిసరాల ప్రాంతాలకు చెందిన ప్రజలు పట్టణానికి రావాలన్నా, పట్టణం నుంచి వివిధ ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ప్రజలు సమీప గ్రామాలకు వెళ్లాలన్నా ఈ కూడలి ద్వారానే రాకపోకలు సాగించాల్సివుంటుంది. దీంతో జాతీయ రహదారిపై వాహనాలు రద్దీ ఉన్న సమయంలో కూడలిని దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కూడలి దాటే సమయంలో జరిగిన పలు ప్రమాదాల్లో గాయాలపాలవడంతో పాటు, పలువురు మృతిచెందిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి ఈప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

### 66 గ్రాముల బంగారు, 250 గ్రాముల వెండి రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులురెడ్డి - నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు

నాయుడుపేట టౌన్, మార్చి 22: వివిధ చోరీ కేసుల్లో నిందితుడిని అరెస్టు చేసి, బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు నాయుడుపేట అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన సోమశేఖర్ నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు, పట్టణాల్లో చోరీలకు పాల్పడ్డాడు. శుక్రవారం నాయుడుపేట - మల్లాం జంక్షన్ కూడలి వద్ద సోమశేఖర్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 66 గ్రాముల బంగారు, 250 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపీ పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహస్వామికి పూజలు



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న చంద్రబాబు తదితరులు

నాయుడుపేట టౌన్, మార్చి 22: నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోనలోని లక్ష్మీనరసింహస్వామి పూజల్లో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు శుక్రవారం పెంచలకోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వచ్చారు.స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట డాక్టర్ విజయశ్రీ కూడా ఉన్నారు.

## వేమిరెడ్డి దంపతులకు సన్మానం



వేమిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు


నాయుడుపేట/సూళ్లూరుపేట, మార్చి 22: నెల్లూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిలను తిరుపతి పార్లమెంటు తెలుగుయువత ఉపాధ్యక్షుడు పరసా రాజా సన్మానించారు. శుక్రవారం నెల్లూరులో వారిని కలిసిన పరసా రాజా శాలువాతో సత్కరించారు. అలాగే సూళ్లూరుపేట టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, మీజూరు వెంకటేశ్వర్లు రెడ్డి, శశిధర్, ఆలీబాయ్, వెంకటేశ్వర్లు తదితరులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

## శ్మశానానికి స్థలం కేటాయించండి

బాలాయపల్లి, మార్చి 22: బాలాయపల్లి గిరిజన కాలనీ శ్మశానానికి స్థలం కేటాయించాలని స్థానికులు శుక్రవారం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గతంలో కాలనీలో ఎవరైనా మృతి చెందితే సమీపంలోని చుట్టి చెరువులో ఒక అంచున పూడ్చి పెట్టేవారమని తెలిపారు. చుట్టి గ్రామస్థుల అభ్యంతరంతో చెరువులో మృతదేహాలను పూడ్చేందుకు ఆటంకం ఏర్పడిందన్నారు. తమ కాలనీకి శ్మశాన స్థలాన్ని కేటాయించాలని కోరారు. పరిశీలించి స్థలాన్ని కేటాయిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు.



## వెంకన్న సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద వెంగ్‌సర్కార్

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్, మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. వెంగ్‌సర్కార్ మీడియాతో మాట్లాడుతూ టీ20 వరల్డ్‌కప్‌లో భారత్ విజయం సాధిస్తుందన్నారు.

## గురుకులాల్లో ప్రవేశానికి 31లోగా దరఖాస్తు చేసుకోండి

వెంకటగిరి టౌన్, మార్చి 22: గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 తరగతులు, జూనియర్, డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు మార్చి 31 తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీఆర్ఎస్ కన్వీనర్ మల్లం పాటి రజని, ప్రిన్సిపాల్ శారదాబాయి చౌదరి శుక్రవారం కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25 నిర్వహిస్తామని చెప్పారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత వసతితో పాటు సీఎంఏ, సీఏ, నీట్, ఐఐటీ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

## కాలగందలో పోషణ పక్వాడ

బాలాయపల్లి, మార్చి 22: చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల పోషకాహార లోపాన్ని నివారించడంతో పాటు మాతా శిశు మరణాలను అరికట్టవచ్చని అంగన్వాడీ పర్యవేక్షకురాలు రాజేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని కాలగంద గ్రామంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేటలో రసవత్తర పోరు

- ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ
- హ్యాట్రిక్ కోసం కిలివేటి పోరాటం



తడ, మార్చి 22: సూళ్లూరుపేట నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల హడావుడి మొదలైపోయింది. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ తమ అభ్యర్థులను ఖరారు చేశాయి. టీడీపీ అభ్యర్థిగా నెలవల విజయశ్రీని ఆ పార్టీ ఎంపిక చేసింది. అధికార వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మరోమారు అవకాశం ఇస్తూ పోటీలో నిలిపింది. 2014, 19 ఎన్నికల్లో విజయం సాధించిన కిలివేటి సంజీవయ్య ఈ సారి కూడా గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు. తన కుటుంబానికి 20 యేళ్ల తరువాత వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కుమార్తెను అసెంబ్లీకి పంపాలన్న పట్టుదలతో నెలవల సుబ్రహ్మణం ఉన్నారు. టీడీపీ అభ్యర్థి విజయశ్రీ రాజకీయాలకు పూర్తిగా కొత్త అయినా ఆమె తండ్రి నెలవల సుబ్రహ్మణ్యం సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తరువాత జరిగిన మూడు ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ దక్కకపోవడంతో పోటీకి దూరమయ్యారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా టీడీపీ అధిష్ఠానం ఆయన కుమార్తె విజయశ్రీకి టికెట్ కేటాయించింది. అభ్యర్థి కుమార్తె అయినా గెలుపు బాధ్యత నెలవల సుబ్రహ్మణ్యం తన భుజాల మీద వేసుకుని ప్రచారం సాగిస్తున్నారు. ఆయనకు ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ అండదండలు అందిస్తూ మార్గదర్శకం చేస్తుండటంతో ప్రచారంలో దూసుకుపోతున్నారు. మరో వైపు వైసీపీ నుంచి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ముచ్చటగా 3వ సారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉన్నారు. ఆర్థికంగా కొంత బలవంతుడైన సంజీవయ్యకు పార్టీ అండగా ఉన్నా, అసమ్మతి రాగం వినిపిస్తున్న నాయకుల సంఖ్య ఎక్కువగానే ఉంది. వారిని బుజ్జగించేందుకు కిలివేటి మల్లగుల్లాలు పడుతున్నారు. అలాగే టీడీపీ అభ్యర్థి నెలవల విజయశ్రీకి సైతం మొదట్లో అసమ్మతి బెడద ఉన్నా... వారందరినీ సముదాయించడంలో కొండేపాటి గంగాప్రసాద్ సఫలమయ్యారు. సూళ్లూరుపేట నియోజకవర్గానికి పెద్ద దిక్కుగా ఓ వెలుగు వెలిగిన వేనాటి రామచంద్రారెడ్డి కొద్దిరోజుల క్రితం టీడీపీకి రాజీనామా చేసినా ఆయన అనుచరులు పూర్తిగా పార్టీలోనే ఉండిపోయారు. ఇక వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో రాజీనామా చేసి టీడీపీలో చేరుతుండటంతో ఆ పార్టీ హుషారు కనిపిస్తోంది. అంతేకాకుండా వైసీపీలోని కొందరు నాయకులు తెరచాటుగా నెలవలకు సహకారం అందించేందుకు సిద్ధపడుతున్నట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

# టీడీపీలోకి యువత



పార్టీలో చేరిన రోసనూరు పంచాయతీ యువకులతో టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 22: మండలంలోని రోసనూరు, రోసనూరు రాజుపాలెం, కొత్తూరు గ్రామాలకు చెందిన యువకులు టీడీపీలో చేరారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నేతలు ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్థానిక నేత దొమ్మరాజు సత్యంరాజు సమక్షంలో యువకులు పార్టీలో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారనే నమ్మకంతోనే విద్యావంతులు, యువకులతో పాటు పలు పార్టీలకు చెందిన నేతలు టీడీపీలో చేరుతునట్లు తెలిపారు. పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ నెలవల విజయశ్రీ ఆమె విజయానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, పేరం మధుసూదన్ నాయుడు, దామెర ప్రసాద్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కేవీనాయుడు, సుధాకర్‌రెడ్డి, రామకృష్ణా, మునీష్, వెంపళ్ల వెంకటేశ్వర్లు, మల్లికార్జునరెడ్డి, రంగనాథ నాయుడు, మారాబత్తిన గురవయ్య, నెలవల ప్రసాద్‌యాదవ్, జడపల్లి వెంకటేశ్వర్లు, బడికాల శ్రీనివాస్, వేలూరు రమణయ్య, దామతోటి సుబ్రహ్మణ్యం, ఆరూరు సుబ్రహ్మణ్యం, రాపూరు పరుశురాం, ఉల్లిపాయల శ్రీనివాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల ప్రారంభం



ఆర్‌వో ప్లాంటును ప్రారంభిస్తున్న జైసింగ్

వెంకటగిరిటౌన్, మార్చి 22: వెంకటగిరిలోని బంగారుపేట ప్రాథమిక పాఠశాల, ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాల, ఆర్ఎస్ కండ్రిగ పాఠశాలల్లో శ్రీనివాసన్ సేవా ట్రస్టు(టీవీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను ట్రస్టు క్లస్టర్ ఇన్‌చార్జి జైసింగ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ ట్రస్టు లక్ష్యమని అన్నారు. ఇప్పటికే మండలంలో ఐదు ఆర్వో ప్లాంట్లను ప్రారంభించామని, త్వరలో మరో మూడింటిని ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే వెనకబడిన ప్రాంతాల వారికి ఆర్థిక తోడ్పాటు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వినియోగించండి




ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గూడూరు, మార్చి 22: నీటిని పొదుపుగా వినియోగించాలని స్వర్ణాంధ్రభారతి పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని కోర్టు సెంటర్ నుంచి గాంధీనగర్ వరకు స్వర్ణాంధ్రభారతి పాఠశాల ఆధ్వర్యంలో ప్రపంచ నీటి పొదుపు దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోని జీవరాసి మనుగడకు నీరు ఎంతో అవసరమన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. నీరు లేకపోతే జీవం ఉండదన్నారు. కార్యక్రమంలో సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధూ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటికి తప్పని తిప్పలు

గూడూరు అర్బన్, మార్చి 22: పట్టణంలో గత ఐదు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి కండలేరు జలాశయం నుంచి నీటిని అందించే పైపులైన్లు మరమ్మతుల కారణంగా ఐదు రోజులుగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్ అధికారులు ట్యాంకర్ల ద్వారా పలు వీధులకు నీటిని సరఫరా చేస్తున్నా, అవి చాలక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు ముందస్తుగా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకుని పైపులైన్ల మరమ్మతుల సమయంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ట్యాంకరు ద్వారా మంచినీరు సరఫరా



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

గూడూరు, మార్చి 22: స్థానిక 4వ వార్డులోని నరసయ్య గుంట ప్రాంతానికి టీడీపీ నాయకుడు చంద్రమౌళి ట్యాంకర్ ద్వారా మంచినీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులుగా పట్టణంలో పైపులైన్ల మరమ్మతుల కారణంగా తాగునీటికి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సూచనల మేరకు తన సొంత నిధులను వెచ్చించి ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

## అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించండి

తిరుపతి(రూరల్), మార్చి 22: వ్యవసాయ కోర్సులు చదివే విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా అంకుర సంస్థల ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సి.రమణ పేర్కొన్నారు. ఆర్ఏఆర్ఎస్‌లో ఆర్‌కేవీవై రాఫ్తార్ పథకం ద్వారా నిర్వహించే ఆంగ్రు అగ్రి బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో శుక్రవారం అగ్రివిజన్ 1.0 కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఏడీఆర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఆవిష్కరణలు రూపొందించి, తద్వారా కొత్త సంస్థల ఏర్పాటుకు ముందుకురావాలని తెలిపారు. కాగా, అగ్రి బిజినెస్ కేంద్రం ద్వారా శిక్షణ పూర్తిచేసి, ఆర్థిక సహకారం అందుకున్న మొదటి, రెండవ బ్యాచ్‌లకు చెందిన అంకుర సంస్థలకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ పీవీ సత్యగోపాల్, డాక్టర్ ఆర్.కల్పనాశాస్త్రి, ఎం.శ్రీనివాసరెడ్డి, సి.సునీల్ పాల్గొన్నారు.

## మేరిగ విజయానికి కృషి

కోట, మార్చి 22: కోటలోని ఏఎన్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం వైసీపీ మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు, వైసీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనంజయరెడ్డి మాట్లాడుతూ అందరూ కలసికట్టుగా పనిచేసి మేరిగ మురళీధర్‌ను గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా మండలంలోని రెండు గ్రామాలకు చెందిన వలంటీర్లు సమావేశానికి వచ్చారు. మీడియా ఫొటోలు తీసేందుకు ప్రయత్నించడంతో సమావేశం నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, సంపత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతలు సంబరాలు

కోట, మార్చి 22: నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేరును అధిష్ఠానం ఖరారు చేయడంతో కోట మండల పరిధిలోని విద్యానగర్ గాంధీబొమ్మ సెంటర్ శుక్రవారం ఆ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి వాకా విజయభాస్కరరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు బాణాసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు.

## వైసీపీ నేతల ప్రచారం

గూడూరు అర్బన్, మార్చి 22: పట్టణంలోని 1,2వ వార్డుల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ కుమారులు రేవంత్ చక్రవర్తి, హేమంత్ కల్యాణ్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తమ తండ్రి మురళీధర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బొమిడి శ్రీనివాసులు, సతీష్‌రెడ్డి, తాళ్లూరు శ్రీనివాసులు, గురవయ్య, సునీల్‌రెడ్డి, గోవర్ధన్, అశోక్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఎంఈవో తనిఖీలు



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎంఈవో

కోట, మార్చి 22: మండల పరిధిలోని కేశవరం పంచాయతీ సిద్ధమ్మకండ్రిగ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యాబోధనపై హెచ్ఎంకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. భోజనంలో నాణ్యత లోపించకుండా చూడాలని నిర్వాహకులను ఎంఈవో ఆదేశించారు.

## కేజ్రీవాల్ అరెస్టు దేశ చరిత్రలో చీకటి అధ్యాయం

### ఆమ్‌ఆద్మీ పార్టీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా నిలిచిపోతుందని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆమ్‌ఆద్మీ పార్టీని రాజకీయంగా ఎదుర్కోలేకనే బీజేపీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిందని ఆరోపించారు. పదేళ్లలో జాతీయ పార్టీగా అవతరించిన ఆమ్‌ఆద్మీని అణిచివేయడం ప్రధాని తరం కాదని స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేత రాంభూపాల్ రెడ్డి, సీపీఎం నేత నాగరాజు, సీపీఐ నేత మురళి, ఆమ్‌ఆద్మీ నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటాచలపతి, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు, సీవైఎస్ రాష్ట్ర కన్వీనర్ జగదీష్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేష్ రాయల్ పాల్గొన్నారు.

## సీ-విజిల్‌కు ఫిర్యాదు చేయండి

తిరుపతి, మార్చి22(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సీ-విజిల్ యాప్‌కు ఫిర్యాదు చేయాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసే అంశాల్లో డబ్బు, లిక్కర్ పంపిణీ, బెదిరింపులు, ఉచిత బహుమతుల పంపిణీ, ఆయుధాల ప్రదర్శన, ఫేక్ న్యూస్ అంశాలపై ఫొటోలు, వీడియోలు, వాయిస్ మెసేజ్ పంపించడం చేయవచ్చునని పేర్కొన్నారు. కంట్రోల్ రూములోని 0877-2256766 నెంబరుకు కాల్ చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.

## చెరువులోపడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

నాయుడుపేట, మార్చి 22: నాయుడుపేట పట్టణ పరిధిలోని విన్నమాల చెరువులో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... వాకాడు మండలం తిరుమూరు గ్రామానికి చెందిన జక్కరయ్య(51) కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా తిరుగుతుంటేవాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. శుక్రవారం ఉదయం విన్నమాల చెరువులో జక్కరయ్య మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ గోపీ సంఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీవో

తడ, మార్చి 22: మండల పరిధిలోని కాదలూరు, కొండూరు, అండగుండాల, వెంజూరుపాడు, మాంబట్టు పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో చంద్రముని శుక్రవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. కాదలూరు పోలింగ్ కేంద్రం సమీపంలో చెత్తాచెదారాలు ఉండటంతో పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఆర్డీవో వెంట తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు సయ్యద్ ఇక్బాల్, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## వైసీపీ నేత మృతి



ప్రభాకర్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

ఓజిలి, మార్చి 22: ఓజిలి మండలం కురుగొండ గ్రామానికి చెందిన వైసీపీ నేత, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ భర్త ముమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి(75) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరులోని అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. గతంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడిగా, రైతు సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి, ఆయన సతీమణి, మాజీ మంత్రి రాజ్యలక్ష్మిలకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. అనంతరం వైసీపీలో చేరారు. ప్రభాకరరెడ్డి మృతి పట్ల మండలంలోని టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకులు సంతాపం తెలిపారు.

## వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న జలీల్ అహ్మద్

కోట, మార్చి 22: కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురానికి చెందిన నిరుపేద ముస్లిం మహిళ షేక్ జరీనా గర్భసంచి వ్యాధితో బాధపడుతోంది. ఆమె వైద్య ఖర్చుల కోసం గ్రీన్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ హామీ రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద ముస్లిం కుటుంబాలను గ్రీన్ ఫౌండేషన్ తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జలీల్ అహ్మద్, నౌషాద్, నాయబ్ రసూల్, బాబు, షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## వాహనాలు, ర్యాలీకి అనుమతులు తప్పనిసరి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22: సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం కోసం వినియోగించే వాహనాలు, ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. విజయవాడ నుంచి ఆయన వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివిధ ఓటరు ఫారాలు, క్లెయిమ్స్, అబ్జెక్షన్స్‌ను నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ర్యాలీలు, ప్రచారం కోసం వాడే వాహనాల కోసం సంబంధిత రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన విజ్ఞప్తి మేరకు అనుమతులు ఇవ్వాలన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ఉండాలని, శాంతిభద్రతల పర్యవేక్షణ, సీజర్ ఆఫ్ క్యాష్, లిక్కర్, డ్రగ్స్ తదితరాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నూతన ఓటర్ల నమోదుకు ఫారం-6 అందజేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచలకిషోర్, నోడల్ అధికారులు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## నిర్భయంగా ఓటువేసేలా చర్యలు: డీఐజీ

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడూ నిర్భయంగా ఓటు వేయడానికి పోలీసు శాఖ తగిన చర్యలు తీసుకుందని డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న అయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలను పరిశీలించి, శాంతి భద్రతల సమస్యలు లేకుండా చూస్తున్నామన్నారు. సమస్యాత్మక వ్యక్తులను బైండోవర్ చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ తుపాకులను డిపాజిట్ చేయిస్తున్నామన్నారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, మద్యం, నగదు రాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.10 కోట్లు

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.10 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,485 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 23,851 మంది తలనీలాలు సమర్పించారు.

## అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.10లక్షలు విరాళంగా అందింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, తిరుపతికి చెందిన ప్రొఫెసర్ నారాయణరావు ఈ విరాళాన్ని అందజేశారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డికి ఈ విరాళాన్ని దాత అందజేశారు.

## పదో తరగతి పరీక్షలకు 541 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మార్చి 22: జిల్లాలో శుక్రవారం జరిగిన పదో తరగతి పరీక్షలకు 541 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గణిత పరీక్షకు 27,182 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 26,641 మంది హాజరయ్యారు. 98 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారని డీఈవో డాక్టర్ శేఖర్ తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాస్ కాపీయింగ్ జరుగలేదని వెల్లడించారు.